

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No.37ACDFM5465G1Z1

No: KNL/3`78(D)/2026`2028

పరిసరాల పరిశుభ్రతేఆరోగ్యానికి భద్రత



Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 173 పేజీలు - 08 వెల - 05/- ఆదివారం 21-06-2026


బాబా రామ్ దేవ్ నిర్వహించిన యోగసాధన కార్యక్రమాన్ని తిలకించిన ముఖ్యమంత్రి

## విలువలను కాపాడాలి...

# భావితరాలకు అందించాలి

- సాంకేతికతను వినియోగించుకోవాలి...వ్యవసం కాకూడదు
- ప్రధాని మోదీ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేద్దాం... వికసిత్ భారత్ సాధిద్దాం
- ఉండవల్లిలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- చంద్రబాబు యోగి.. కర్మ యోగి అంటూ బాబా రామ్‌దేవ్ కితాబు



అమరావతి, జూన్ 20:లి మన సంస్కృతి, విలువలే భారతదేశాన్ని ప్రపంచానికి విశ్వగురు స్థానంలో నిలిపాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న సంస్కృతి, విలువలను కాపాడుకుని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉండవల్లి గుహల వద్ద బాబా రామ్ దేవ్ నిర్వహించిన యోగా సాధన కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. యోగాంధ్ర లోగో ఉన్న చొక్కాను ధరించి ముఖ్యమంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబా రామ్ దేవ్ నేతృత్వంలో జరిగిన యోగభ్యాసాన్ని ముఖ్యమంత్రి తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగాసనాలను సీఎం చంద్రబాబుకు రామ్ దేవ్ వివరించారు. సీఎం చంద్రబాబు ఎదుట చక్రాసనం, వృశ్చికాసనం, మయూరాసనం, హనుమానాసనం, రాజ్ కపోతాసనం, పవర్ యోగా వంటి ఆసనాలను రామ్ దేవ్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."బాబా రామ్ దేవ్‌తో నాకు 30 ఏళ్ల నుంచి పరిచయం ఉంది. రామ్ దేవ్ బాబా యోగాను ప్రజల్లోకి తీసుకెళ్లారు. వేలాది మంది స్వచ్ఛంధంగా వచ్చి రామ్ దేవ్ బాబా దగ్గర యోగాలో శిక్షణ తీసుకుంటారు. యోగాను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన రామ్ దేవ్ బాబాకు దేశ ప్రజల తరపున కృతజ్ఞతలు. నేను 30 ఏళ్ల నుంచి టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నాను... రామ్ దేవ్ బాబా యోగాను ప్రమోట్ చేస్తున్నారు. టెక్నాలజీ వితవుట్ అడిక్షన్ అనే విధానంలో వెళ్లాలి... దీనికి ఆధ్యాత్మిక, యోగా వంటివి ఉపకరిస్తాయి. యోగాతో శరీరం,

## అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి

- నెట్‌జీరో కాన్సెప్ట్‌లో భాగంగా ఇండక్షన్ స్టవ్ అందజేత
- చిన్నారులతో కలిసి రాగి జావ తీసుకున్న సీఎం




చిలకలూరిపేట, జూన్ 20 పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుంట్లలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సందర్శించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, అన్నదాత సుఖీభవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు లింగంగుంట్ల గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి తొలుత అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. నెట్ జీరో విధానంలో భాగంగా రూ.32 కోట్లతో రాష్ట్రంలోని 44,346 అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇండక్షన్ స్టవ్‌లు, పాత్రలను అందజేస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి లింగంగుట్ల అంగన్వాడీ కేంద్రానికి ఇండక్షన్ స్టవ్, స్టీల్ పాత్రలను అందించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని సరుకుల నిల్వ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగతాది 2లో

## కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

: తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి

- కొత్త ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ తప్పుడు ప్రచారం
- బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వస్తారన్న ఎస్ఈవో సుదర్శన్ రెడ్డి
- కొత్త ఓటర్లు వారి వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ



తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (రా×=) ప్రక్రియపై ఈరోజు హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు.సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు మిగతాది 2లో

## ఆర్డీఓ ఆఫీస్ ముందు బాధితురాలి నిరసన


### "పది నెలల వేధింపులకు చరమగీతం పాడాలి!"

గార్గేయపురం భూ వివాదంలో విచారణ పూర్తి -- తుది ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ యంత్రాంగం

- ఫోర్జరీ ఆరోపణలు నిరూపించలేకపోయిన పిటిషనర్ బైరెడ్డి హరిత.. రికార్డుల ఆధారంగా 'వెబ్ ల్యాండ్' లో గొల్ల లక్ష్మీనారాయణ పేరే ఖరారు
- తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని అధికారుల స్పష్టీకరణ

మిగతా 9లో

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో



రెవెన్యూ డివిజనల్ కార్యాలయం (ఆర్డీఓ) వేదికగా గత కొంతకాలంగా సాగుతున్న గార్గేయపురం భూ వివాదం శనివారంతో ఒక కొలిక్కి వచ్చింది. న్యాయం కోసం పది నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానంటూ, శనివారం ఉదయం 11:30 గంటల నుండి సాయంత్రం వరకు వేచి చూసిన పిటిషనర్ బైరెడ్డి హరిత ఆర్డీఓ కార్యాలయం వద్ద తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మహిళనని కూడా చూడకుండా గంటల తరబడి నిరీక్షించేలా చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి మరియు జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**అసలు వివాదం ఏమిటి?**

కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం గ్రామానికి చెందిన సర్వే నంబర్ 619/3లోని 1.63 ఎకరాల భూమిపై గత కొంతకాలంగా

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేదాకా కదిలేది లేదు

: కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు




- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టు
- జంతర్ మంతర్ వద్ద సీజేపీ వ్యవస్థాపకుడి నిరసన
- అనుమతి ముగిసినా కదిలేది లేదంటున్న ఆందోళనకారులు

## పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు భగీరథ్‌కు బెయిల్


- పోక్సో కేసులో నెల రోజులుగా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్
- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన మల్కాజ్‌గిరి కోర్టు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారిన భగీరథ్ వ్యవహారం




## మెట్రో పెండింగ్ సమస్యలు..

### కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ

- రైల్వే మంత్రితో భేటీకి ఏర్పాట్లు చేయాలని కిషన్ రెడ్డికి విజ్ఞప్తి
- అధికారులు, పత్రాలతో సమావేశానికి హాజరవుతానని వెల్లడి
- జూన్ 22, 23 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న ముఖ్యమంత్రి




కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీ పర్యటనలో ఉంటానని హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పత్రాలతో వస్తానని, అధికారులతో కలిసి సమావేశానికి హాజరవుతానని ఆ లేఖలో పేర్కొన్నారు. మిగతాది 2లో

## నిరాహార దీక్ష చేస్తా

: కాంగ్రెస్ ప్రభుత్వానికి కవిత వార్నింగ్

- సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లాలోని గనిని సందర్శించిన కవిత
- మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న 1200 మంది వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్
- ఉద్యోగాలు ఇవ్వకపోతే జులై 20 నుంచి నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరిక



సింగరేణి 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై ఆమె మాట్లాడుతూ.మిగతాది 2లో

## నేడు నీట్ రీ ఎగ్జామ్.. మాక్ డ్రిల్ నిర్వహించిన ఎన్‌టీఏ

- పేపర్ లీక్ వివాదం తర్వాత రేపు నీట్ రీ-ఎగ్జామ్
- దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది విద్యార్థులు హాజరు
- పరీక్షా కేంద్రాల వద్ద కనీవినీ ఎరుగని భద్రతా ఏర్పాట్లు




జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)లో గతంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా నేషనల్

# నిరాహార దీక్ష చేస్తా: కాంగ్రెస్ ప్రభుత్వానికి కవిత వార్నింగ్

సింగరేణి 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న దాదాపు 1200 మంది వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఒక నెల రోజులు టైమ్ ఇస్తున్నామని, ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకపోతే జులై 20 నుంచి తాను నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరించారు. సింగరేణిలో ఏ చిన్న పని జరగాలన్నా నేరుగా డిప్యూటీ సీఎం ఆఫీస్ నుంచే లంచాలు అడుగుతున్నారంటూ కవిత సంచలన ఆరోపణ చేశారు. కాంగ్రెస్ పాలనలో లాభాల్లో ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. మొన్న జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడికి తీవ్ర గాయాలవడానికి యాజమాన్యం వాడుతున్న నాసిరకం డిటోనేటర్లే కారణమన్నారు. గనుల లోపల పని చేసే కార్మికులకు కనీసం స్వచ్ఛమైన గాలి, మంచి నీరు కూడా ఇవ్వకుండా అధికారులు కక్కుర్తి పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైర్ అయిన కార్మికులకు సొంత ఇంటి కల నెరవేర్చడం కోసం సింగరేణికి ప్రత్యేకంగా 'హౌసింగ్ బోర్డు' ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం లేదా కార్మిక సంఘం తరఫున రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. అలాగే విజిలెన్స్ ఎంక్వయిరీల పేరుతో కార్మికులను భయభ్రాంతులకు గురిచేయవద్దని అన్నారు. ఉద్యమ కాలం నుంచే తాను సింగరేణి కార్మికులతో కలిసి నడిచానని గుర్తుచేసిన కవిత... తెలంగాణ హక్కుల కోసం తాను స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని భూపాలపల్లి ప్రజలు, బొగ్గుగని కార్మికులు గుండెల్లో పెట్టుకుని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు నీట్ రీ ఎగ్జామ్.. మాక్ డ్రిల్ నిర్వహించిన ఎన్‌టీఏ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పటిష్ఠ చర్యలు చేపట్టింది. రేపు (ఆదివారం, జూన్ 21) జరగనున్న నీట్ రీ-ఎగ్జామ్ కోసం శనివారం నాడు చెన్నైతో పాటు ఇతర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించింది. ప్రశ్నాపత్రాల లీకేజీకి ఏమాత్రం ఆస్కారం లేకుండా చూడటమే లక్ష్యంగా ఈ డ్రిల్ సాగింది. ఈ మాక్ డ్రిల్‌లో భాగంగా, ఎస్కార్ట్ భద్రతతో పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను చేరవేయడం, పరీక్ష అనంతరం అదే భద్రత నడుమ సమాధాన పత్రాలను సేకరించడం వంటి ప్రక్రియలను ఎన్‌టీఏ అధికారులు పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాలన్నింటినీ సీసీటీవీ నిఘా నీడలోకి తెచ్చారు. పరీక్ష రోజున ఎలాంటి అక్రమాలకు తావులేకుండా బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నారు.

**విద్యార్థులకు ముఖ్య సూచనలు**

పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5:15 గంటలకు ముగుస్తుంది. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డుతో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డును, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలను తప్పనిసరిగా తీసుకురావాలి. తేలికైన దుస్తులు (హాఫ్-స్లీవ్ షర్టులు/టీ-షర్టులు, ప్యాంట్లు), స్లిప్పర్లు లేదా తక్కువ హీల్స్ ఉన్న పాదరక్షలు ధరించాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, పెద్ద బెల్ట్ బకిల్స్, బరువైన ఆభరణాలు వంటివి కేంద్రాల్లోకి అనుమతించరు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ 2026 పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో, రద్దు చేసిన పరీక్షను జాతీయ పరీక్షల సంస్థ తిరిగి నిర్వహించనుంది. ఈ పరీక్షకు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 22.79 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు పెన్-అండ్-పేపర్ విధానంలో ఈ పరీక్ష జరగనుంది. దేశవ్యాప్తంగా 551 నగరాల్లో 5,440 కేంద్రాలతో పాటు, విదేశాల్లో 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టారు. దేశవ్యాప్తంగా 1.38 లక్షల ఏఐ ఆధారిత సీసీటీవీ కెమెరాలు, 51,000 సిగ్నల్ జామర్లు, రెట్టింపు బయోమెట్రిక్ తనిఖీలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో సగటున 40-50 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. మే 3న జరిగిన అసలు పరీక్షకు సంబంధించి, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోని కోచింగ్ కేంద్రాలలో "గెస్ పేపర్" పేరుతో ప్రశ్నపత్రం లీక్ అయినట్లు తీవ్ర ఆరోపణలు వచ్చాయి. దీనిపై మే 12న కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో ఎన్‌టీఏ పరీక్షను రద్దు చేసి, సీబీఐ విచారణకు ఆదేశించింది. ప్రస్తుతం ఈ కేసులో పలువురిని అరెస్ట్ చేసి విచారణ కొనసాగిస్తున్నారు. పరీక్షకు సంబంధించిన పిటిషన్లను సుప్రీంకోర్టు జులైకి వాయిదా వేయడంతో, రీ ఎగ్జామ్ నిర్వహణకు మార్గం సుగమమైంది. వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారంపైనే ఆధారపడాలని విద్యార్థులకు స్పష్టం చేసింది.

# విలువలను కాపాడాలి... భావితరాలకు అందించాలి

6-7 శతాబ్దాలకు చెందిన ఉండవల్లి గుహలకు చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం ఉంది. పద్మనాభ స్వామి ఈ ఉండవల్లి గుహల్లో కొలువై ఉన్నాడు."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**రసాయన రహిత పంటలు... యోగా సాధనతో ఆరోగ్యం**

"ప్రధాని మోదీ యోగాకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చారు... 190 దేశాలు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. భారత దేశ కీర్తి ప్రతిష్టలను మరింతగా ఇనుమడింప చేసేవి మన సంస్కృతి, విలువలే. అలాంటి మన దేశ సంస్కృతిని ప్రపంచ దేశాల ముందు ఉంచిన ఘనత మోదీకే దక్కింది. మన విలువలను కాపాడుకోవాలి.. భావితరాలకు అందించాలి. ఆధ్యాత్మికతతో కూడిన వికసిత్ భారత్ సాధించాలని ప్రధాని ప్రయత్నిస్తున్నారు.. ఆయనకు సహకరిద్దాం. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం.. 20 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలోకి వస్తున్నారు. రసాయన రహిత పంటలను ప్రజలకు అందించే లక్ష్యంతో పని చేస్తున్నాం. ప్రజా రోగ్యం కోసం సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తున్నాం. సంజీవనిలో భాగంగా యోగాసాధన, ప్రాణామయం వంటివి కూడా చేరుస్తున్నాం. సంజీవని కార్యక్రమంలో రోగ చికిత్స కంటే.. రోగ నివారణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. దేవతల రాజధాని అమరావతి స్ఫూర్తితో ప్రజా రాజధానిని నిర్మిస్తున్నాం. రాజధానికి భూములిచ్చిన రైతులకు ధన్యవాదాలు. నెట్ జీరో విధానంలో కాలుష్య రహిత రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం. రాజధాని ప్రాంతంలో అభివృద్ధితో పాటు ఆధ్యాత్మికతకు, పర్యాటకానికి పెద్ద పీట వేస్తున్నాం. నివాస యోగ్య ప్రాంతంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం. అమరావతి భవిష్యత్ నగరం."అని సీఎం చెప్పారు. లిదేశం కోసం ప్రధాని పని చేస్తున్నారు... చంద్రబాబు సహకరిస్తున్నారు: రామ్ దేవ్ బాబాలి ఉండవల్లి గుహల వద్ద తన శిష్యులతో కలిసి యోగాభ్యాసం నిర్వహించిన రామ్ దేవ్ బాబా సీఎం చంద్రబాబు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా రామ్ దేవ్ బాబా మాట్లాడుతూ..." యోగా మన దేశానికి గర్వకారణం. సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా రమ్మన్నారు.. కానీ యోగా అతిథిగా వచ్చాను. ఈ వయస్సులో కూడా చంద్రబాబు ఆరోగ్యంగా ఉన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి, విజన్ కలిగిన ముఖ్యమంత్రి. ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. ఏక్ భారత్... శ్రేష్ట్ భారత్ అనే నినాదంతో ప్రధాని పని చేస్తున్నారు.. దానికి చంద్రబాబు సహకరిస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్ కోసం కృషి చేస్తూ.. భారతదేశాన్ని విశ్వగురుగా నిలిపేందుకు ప్రధాని చేస్తున్న కృషికి చంద్రబాబు తోడయ్యారు. చంద్రబాబు తరహాలో ప్రతి ముఖ్యమంత్రి పని చేస్తే వికసిత్ భారత్ 2047 లక్ష్యం ముందుగానే సాకారం అవుతుంది. ప్రజా రాజధాని అమరావతి.. ఇప్పుడు యోగ రాజధాని అయింది. రాజధానిని పచ్చదనంతో విలసిల్లేలా నిర్మిస్తున్నారు. స్విట్జర్లాండ్ దేశంలో ఉన్నటువంటి అందాలు అమరావతిలో ఉన్నాయి. ఉండవల్లి గుహల్లో కొలువైన పద్మనాభ స్వామిని దర్శించుకున్నాను. ఇక్కడి అరటి, మామిడి పండ్లు చాలా రుచిగా ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయాన్ని సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారు. సీఎం చంద్రబాబు ప్రకృతి ప్రేమికుడు, సాంస్కృతిక ప్రేమికుడు, యోగ ప్రేమికుడు సర్వజన ప్రేమికుడు. చంద్రబాబు యోగి, కర్మయోగి."అని రామ్ దేవ్ బాబా అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గావవ శ్రీవంం

# క్రిమినల్స్‌కు కులం లేదు.. వైసీపీ గూండాలను తొక్కి నార తీస్తా

"దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చాను. పదవుల కోసం కాదు. కాకినాడలో ఛార్జ్ తీసుకున్న తర్వాత ఎవరు ఎస్పీగా, కలెక్టర్‌గా ఉండాలో నేను నిర్దేశించలేదు. వ్యవస్థలను బలోపేతం చేయండి, నా నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాదని వారికి చెప్పాను. నా పార్టీ వాళ్లను పట్టుకున్నా వదలమని చెప్పను. ఎమ్మెల్సీ తన డ్రైవర్‌ను చంపేస్తే జైలుకు వెళ్లి అభినందించే వ్యక్తిని నేను కాదు. తెలిసి తెలియని వయసులో 23 నేరాలు చేసిన వాడ్ని కూడా పసిపిల్లవాడని వెనకేసుకొచ్చే నాయకుడిని కాదు" అని పవన్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి నేరపూరిత భావజాలాన్ని ప్రోత్సహిస్తే భవిష్యత్తు ఊహకు అందకుండా తయారవుతుందని ప్రజలను హెచ్చరించారు.

**శాంతిభద్రతల పునరుద్ధరణే లక్ష్యం**

శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటేనే పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు వస్తాయని, సమాజం సవ్యంగా ముందుకు సాగుతుందని పవన్ కల్యాణ్ అన్నారు. "లా అండ్ ఆర్డర్ అనేది కేవలం ప్రభుత్వ విధి మాత్రమే కాదు, నాగరిక సమాజానికి అది పునాది. అది లేకపోతే సంక్షేమం, ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ కుప్పకూలిపోతాయి. రూల్ ఆఫ్ లాను బలంగా నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులదే. ఏ విషయంలోనైనా ఒత్తిడి తీసుకువచ్చేలా నా నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాదు" అని ఎస్పీ, కలెక్టర్లను ఉద్దేశించి అన్నారు.

**క్రిమినల్స్‌కు కులం రంగు పులమొద్దు**

కొందరు నేరస్తులకు కులం రంగు పులిమి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని, ఇది రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఆంధ్రప్రదేశ్‌కు పట్టిన కులం దరిద్రం వదిలితే తప్ప రాష్ట్రం బాగుపడదు. క్రిమినల్‌కు కులం ఉండదు. అత్యాచారం చేసేవాడికి, దోపిడీ చేసే నీచుడికి కులం ఎందుకు ఉంటుంది? అలాంటి వారిని వెనకేసుకొస్తే అది ఆ వ్యక్తి నైజాన్ని తెలుపుతుంది. ఎమ్మెల్సీ అనంతబాబు ఒక దళిత డ్రైవర్‌ను హత్య చేస్తే, అది కాపులందరికీ చెడ్డపేరు అవుతుందా? ప్రతిదానికీ కులాన్ని లాగడం సరికాదు" అని ఆయన ప్రశ్నించారు. సుగాలి ప్రీతి, వివేకానంద రెడ్డి హత్య కేసుల్లో గత ప్రభుత్వం సాక్ష్యాలను నాశనం చేయడం వల్లే నేరస్తులకు శిక్ష పడటం కష్టమవుతోందని అన్నారు.

**తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసులపై కఠినంగా ఉండాలి**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని పవన్ విమర్శించారు. "నిజమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎంత బలంగా ఎదుర్కొంటామో, తప్పుడు కేసులను కూడా అంతే బలంగా నిలువరించాలి. బాబాసాహెబ్ అంబేద్కర్ మీద గౌరవం ఉన్నవారెవరూ తప్పుడు కేసులు పెట్టరు. సుప్రీంకోర్టు కూడా దీనిపై స్పందించిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మా కూటమి నాయకులు కూడా ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దు" అని విజ్ఞప్తి చేశారు. పౌర సమాజం మేల్కొనాలి

ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించాలని, తమ ప్రాంతాల్లో జరిగే అన్యాయాలపై గొంతెత్తాలని పవన్ పిలుపునిచ్చారు. "కుల సంఘాలకు వాట్సాప్ గ్రూపులు ఉన్నప్పుడు, శాంతిభద్రతల కోసం ఎందుకు లేవు? మీ వీధిలో 30-40 మంది కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడండి. సిటిజన్ కౌన్సిల్స్ ఏర్పాటు చేసుకోండి. మీరు బలంగా నిలబడితే, ఏ క్రిమినల్ కూడా తలెత్తడానికి భయపడతాడు. జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా లా అండ్ ఆర్డర్ సమస్యలపై ఎక్కడికక్కడ గొంతెత్తాలి. నన్ను కులానికి పరిమితం చేయొద్దు" అని చేతులెత్తి నమస్కరిస్తూ కోరారు. వ్యవస్థాగత వైఫల్యం వల్లే ఒక ఎస్సై పరిష్కరించాల్సిన సమస్య డిప్యూటీ సీఎం వద్దకు వస్తోందని, ఇలాంటి పరిస్థితులను మార్చడానికే తాను కట్టుబడి ఉన్నానని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.

# మానవాళి అంతానికి మౌన సాక్ష్యం!

విమానం కూలిపోతే.. అది ఎందుకు కూలింది? క్రాష్ కావడానికి ముందు పైలట్లు ఏం మాట్లాడుకున్నారు? ఈ వివరాలన్నీ 'బ్లాక్ బాక్స్'లో రికార్డవుతాయన్న సంగతి తెలుసు కదా..! అచ్చం అలాగే.. ఒకవేళ భవిష్యత్తులో మానవాళి మొత్తం అంతమైపోయి.. ఆ తర్వాత ఎప్పుడో ఎవరైనా గ్రహాంతరవాసులు ఇక్కడికి వచ్చినా, లేక మళ్లీ మానవజాతి కొత్తగా పురుడు పోసుకున్నా.. అసలు ఏం జరిగిందో, మానవాళి ఎలా అంతమైందో వారికి తెలియడం కోసం ఒక బ్లాక్ బాక్స్ ఉంటే? ..అనే ఆలోచన మీకెప్పుడైనా వచ్చిందా? ఆస్ట్రేలియాలోని 'రౌజర్‌ల్యాబ్', 'ద గ్లూ సొసైటీ' సంస్థలకు అలాంటి ఆలోచనే వచ్చింది. నానాటికీ పెరిగిపోతున్న భూతాపం కారణంగా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రకృతి ఉత్పాతాలు సంభవిస్తున్నా.. అసాధారణ వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నా ప్రజల్లోగానీ, పాలకుల్లోగానీ చలనం రావట్లేదని వారు భావించారు. అందుకే ప్రజల్లో, పాలకుల్లో భవిష్యత్తుపై భయాన్ని, బాధ్యతను పెంచడానికి... 'ఎర్త్ బ్లాక్ బాక్స్' అనే కళాత్మక, సాంకేతిక ప్రయోగాన్ని చేపట్టారు. అందులో భాగంగా ఆస్ట్రేలియాకు దక్షిణంగా ఉన్న టాస్మేనియా ద్వీపాన్ని ఎంచుకుని అక్కడ ఈ 'ఎర్త్ బ్లాక్ బాక్స్'ను నిర్మిస్తున్నారు. ఈ ఏడాది చివరికి దాని నిర్మాణం పూర్తి కానున్నట్టు సమాచారం. ఇదెలా ఉంటుందంటే..

# కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి:

స్వయంగా రానున్నారు. వారు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు ముగించుకుని అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.

# పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు భగీరథ్‌కు బెయిల్

తెలంగాణలో గత నెల రోజులుగా హాట్ టాపిక్‌గా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భగీరథ్‌కు ఎట్టకేలకు మల్కాజ్‌గిరి కోర్టులో ఊరట లభించింది. దాదాపు నెల రోజులుగా చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అతనికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో భగీరథ్‌పై కఠినమైన పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కొడుకు కావడం, పైగా సున్నితమైన కేసు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిన భగీరథ్.. మే 17న పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యాడు. ఆ తర్వాత మేడ్చల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవడంతో నెల రోజులకు పైగా జైల్లోనే గడపాల్సి వచ్చింది. తాజాగా ఇంజినీరింగ్ పరీక్షల నేపథ్యంలో, భగీరథ్‌కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో, భగీరథ్ జైలు నుంచి బయటకు రానున్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేదాకా కదిలేది లేదు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసే వరకు జంతర్ మంతర్ నుంచి కదిలే ప్రసక్తి లేదని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. నీట్-యూజీ 2026 పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీలకు నిరసనగా ఆయన ఈ ఆందోళన చేపట్టారు. పోలీసుల అనుమతి గడువు ముగిసినప్పటికీ, ఆయన తన నిరసనను కొనసాగిస్తుండటం గమనార్హం. ఈ ఆందోళనలో విద్యార్థులు, మద్దతుదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనకారులు ప్లేట్లు, స్పూన్లతో శబ్దం చేస్తూ వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమ శాంతియుత నిరసనను కొనసాగించేందుకు అనుమతిని పొడిగించాలని దీప్కే అధికారులను కోరారు. విద్యావ్యవస్థలో జరుగుతున్న వరుస తప్పిదాల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతున్నా, ధర్మేంద్ర ప్రధాన్ ఇంకా పదవిలో కొనసాగడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. శనివారం సాయంత్రంతో నిరసన గడువు ముగియడంతో పోలీసులు జంతర్ మంతర్‌ను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించారు. అయితే, తమ ఆందోళనను శాంతియుత మార్గంలోనే కొనసాగిస్తామని దీప్కేతో పాటు ఆయన మద్దతుదారులు స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చకపోతే, దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని సీజేపీ హెచ్చరించింది. మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ కావడంతో, మే 12న ఆ పరీక్షను అధికారులు రద్దు చేశారు. తిరిగి ఈ పరీక్షను జూన్ 21న నిర్వహించనున్నారు. ఈ గందరగోళం కారణంగా దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారు. పరీక్ష రద్దు, అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరం.


# అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి

చిన్నారులతో కలిసి జావ తీసుకున్న సీఎం అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముందుగా టీచర్, సహాయకురాలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు ఇచ్చే పోషకాహారం, ప్రాథమిక విద్య, గర్భిణులు, బాలింతలకు అందిస్తోన్న సేవలను గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఇండక్షన్ స్టవ్‌ను అందుకున్న అంగన్వాడీ సహాయకురాలు సీఎం సమక్షంలోనే రాగి జావను కాచారు. చిన్నారులతో మమేకమైన సీఎం...వారితో కలిసి కింద కూర్చునే రాగి జావను తీసుకున్నారు. కాసేపు వారితో ముచ్చటించారు. పచ్చదనం పెంపులో భాగంగా అంగన్వాడీ ప్రాంగణంలో అంగన్వాడీ సిబ్బందితో కలిసి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా, అధికారులు పాల్గొన్నారు.

# మెట్రో పెండింగ్ సమస్యలు..
# కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ

ప్రధానంగా మెట్రో మొదటి దశకు సంబంధించిన ఐఆర్‌ఎఫ్‌సీ (ఐఆర్‌ఎఫ్‌సీ) నిధుల విడుదల, రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులపై చర్చించాల్సి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు.

# టీఎంసీ నిధులు 440 కోట్లు ఫ్రీజ్



కోల్‌కతా, జూన్ 20: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత నిలువునా చీలిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన రూ.440 కోట్ల నిధులను పోలీసులు స్తంభింపజేశారు. పార్టీకి బ్యాంకు ఖాతాల్లో రూ.676.11 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి. అయితే, అసలైన టీఎంసీ తమదేనని, పార్టీ గుర్తుతో సహా ఆస్తులు కూడా తమకే దక్కుతాయని చీలిక వర్గం వాదిస్తోంది. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని ఈ చీలిక వర్గానికి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు ఈ నిల్వలను స్తంభింపజేయాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సొమ్ము అక్రమ మార్గాల ద్వారా సేకరించినదని, దానిని ఎవరెవరి నుంచి ఎలా సేకరించారో దర్యాప్తు నిర్వహించాలని కోరారు. వెంటనే స్పందించిన పోలీసులు మూడు బ్యాంకుల్లో ఉన్న రూ.440 కోట్లను శనివారం ఫ్రీజ్ చేశారు. ఇకపై ఈ డబ్బును బ్యాంకు ఖాతాల నుంచి తీసుకోవటం, ఇతర ఖాతాలకు మళ్లించటం కుదరదని చెప్పారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే చలో విజయవాడ కు పిలుపునిస్తాం.

**ఏ ఐ టి యు సి నంద్యాల పట్టణ కార్యదర్శి ధనుంజయ్.**





పల్లె వెలుగు నంద్యాల రూరల్. మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు, ఔట్సోర్సింగ్, కాంటాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి, చనిపోయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ బస్టాండ్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ధర్నా నిర్వహించి నంద్యాల మున్సిపల్ కార్యాలయం ముందు ఏపీ మున్సిపల్ వర్కర్ యూనియన్ ఏఐటీయూసీ ధర్నా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు, ఏఐటీయూసీ నంద్యాల పట్టణ కార్యదర్శి ధనుంజయ్ లు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రతాప్, లక్ష్మి ఓబులేష్,రంజిత్, మస్తాన్, శివరాం, మరియు మున్సిపల్ శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతేఆరోగ్యానికి భద్రత

**ఎస్సై శ్రీకాంత్**





దొర్నిపాడు జూన్ 20 పల్లె వెలుగు న్యూస్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ ఆదేశాల మేరకు మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర ,స్వర్ణాంధ్ర లోభాగంగా దొర్నిపాడు పోలీస్ ఆవరణ యందు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యానికి భద్రతగా ఉంటుందనిఆయన అన్నారు, మన ఇంటి లాగే మనం పనిచేసే చోట పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు, ప్రజలలో పరిశుభ్రతపై చైతన్యం తీసుకొని వచ్చేలా పోలీసులు సమాజంలో ఆదర్శంగా నిలవాలన్నారు, ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ రావు సిబ్బందిమదార్ వలి తదితరులు పాల్గొన్నారు,

## కొత్త పల్లె ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం



దొర్నిపాడు జూన్ 20 పల్లె వెలుగు న్యూస్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు ప్రతి మూడవ శనివారం ప్రభుత్వ కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్ర ,స్వర్ణాంధ్రలో భాగంగమండలంలోని కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ నేగల హుసేని ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవరణ యందు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి మొక్కలునాటడంవంటి కార్యక్రమం,ర్యాలీనిర్వహించమన్నారు,వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటిస్తే రోగాలు దరిచేరవన్నారు వర్షాకాలం లో నీటిని కాచి వడగట్టి చల్లార్చి తాగాలన్నారు, ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్ కుమార్ రెడ్డి ,కన్నయ్య సిబ్బంది పాల్గొన్నారు

## నల్గొండలో సీఎం సభ ఏర్పాట్లపై సమీక్ష

నల్గొండ జిల్లా ప్రతినిధి : నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో త్వరలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జిల్లా యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం, వేదిక ఏర్పాటు, పార్కింగ్ సదుపాయాలు, భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి సభను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను మంత్రి సూచించారు.

# నంద్యాల జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాలలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ.

**ప్రజలలో పరిశుభ్రతపై చైతన్యం తీసుకువచ్చేలా పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి.**

- **మన ఇంటి లాగే మనం పనిచేసే చోట పరిశుభ్రమైన వాతావరణం ఏర్పాటు చేసుకోవాలి.**
- **జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.**



పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి 3 శనివారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేయాలన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యొక్క పిలుపుమేరకు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ లు పోలీస్ కార్యాలయాలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డి.జి.పి గౌరవ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ ఉత్తర్వులతో, నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు పరిశుభ్రమైన,ఆరోగ్యకరమైన వాతావరనన్నీ ఏర్పాటు చెయ్యడమే లక్షంగా నేడు నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ లు పోలీస్ కార్యాలయాలలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని డి సి ఆర్ బి, స్పెషల్ బ్రాంచ్, పాస్పోర్ట్ కార్యాలయం, సైబర్ క్రైమ్ , ఫ్యాక్షన్ జోన్ కార్యాలయాలు, సాయుధ బలగాల కార్యాలయాలు, మోటార్ వెహికల్ కార్యాలయం, మరియు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు పోలీస్ కార్యాలయాలలో జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది తమ కార్యాలయాలు మరియు చుట్టు పక్కల ప్రాంగణాలను సమగ్రంగా పరిశుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా మొక్కలను నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధులు నిర్వహించే చోట వాతావరణాన్ని పరి శుభ్రంగా ఉంచుకోవడం సిబ్బంది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మన ఇంటిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటామో అదేవిధంగా పనిచేసే చోటా పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలని తద్వారా అనారోగ్య సమస్యలు విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని,ప్రజలలో పరిశుభ్రతపై చైతన్యం తీసుకొని రావడమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తూ పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు.







# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో పాల్గొన్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

- **విజనరీ నేత సీఎం చంద్రబాబు.**
- **ప్లాస్టిక్ రహిత సమాజం లక్ష్యం.**
- **స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర లో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం.**
- **నంద్యాల రైల్వే స్టేషన్ ముందు అపరిశుభ్రతపై ఎంపీ డాక్టర్ బైరెడ్డి అసహనం.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజనరీ నేత అని, 2047 విజన్ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం పెరగాలని, నంద్యాల రైల్వే స్టేషన్ ముందు అపరిశుభ్రతపై రైల్వే శానిటేషన్ అధికారులపై అగ్రహం వ్యక్తం చేస్తూ మళ్లీ నేను వస్తా వారం రోజుల్లో పారిశుధ్యం మెరుగుపడాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిసరాలు, ప్రధాన వీధులు, ప్రజా ప్రదేశాల్లో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమాల్లో నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారితో కలిసి నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారిలు స్వయంగా చీపురులు పట్టి రోడ్లు ఊడుస్తూ పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ గత ఏడాది జనవరిలో ప్రారంభమైన "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం జిల్లాలో నిరంతరంగా కొనసాగుతోందని తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాల నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం, ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ప్రజలకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారిలు సూచించారు.

*రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని కాలువలు పూడికతో నిండిపోవడం వల్ల పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించి, వాటి పరిష్కారానికి మున్సిపల్, రైల్వే శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాలువల పూడికతీత పనులు, అవసరమైన చోట్ల స్లాబ్‌ల ఏర్పాటు, అదనపు డస్ట్‌బిన్‌ల ఏర్పాటు ద్వారా పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించనున్నట్లు వెల్లడించారు.*

నంద్యాల మున్సిపాలిటీలో గత నాలుగు వారాలుగా చేపడుతున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం ద్వారా పేరుకుపోయిన పాత చెత్త (లెగసీ వేస్ట్)ను పూర్తిగా తొలగించి, వ్యర్థాలను వర్గీకరించి కంపోస్టింగ్ యూనిట్లు, బయోడైజెస్టర్ ప్లాంట్లకు తరలించి సేంద్రియ ఎరువులుగా మార్చే చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ జి. రాజకుమారి వివరించారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా నంద్యాలను మరింత పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా, ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించడంతో పాటు రోడ్లపై చెత్త వేయకుండా పరిశుభ్రతను జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛత కార్యక్రమాలు ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా భావించి స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు..

*ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి. శేషన్న, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, స్థానిక మాజీ కౌన్సిలర్లు ముడియం, కొండారెడ్డి, కృపాకర్, కొండబోయిన శ్రీనివాసయాదవ్,వార్డు టీడీపీ ఇంచార్జి లు సూరి, దస్తగిరి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.*

## యోగ ద్వారా ఆరోగ్యం -- యువతలో ఆరోగ్య చైతన్యమే లక్ష్యం



పాణ్యం జూన్ 20 పల్లె వెలుగు : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతిరాం ఫార్మసీ కళాశాలలో యోగాంధ్ర--2026 కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ యోగాసనాలను అభ్యసించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ యోగా గురువు ఎం. నాగేశ్వరరావు యోగా సాధన యొక్క ప్రాముఖ్యతను వివరించారు.యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి తగ్గి ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు.విద్యార్థులు ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి మధుసూదన చెట్టి మాట్లాడుతూ,యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరమని పేర్కొన్నారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా పొందేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారి డాక్టర్ ఎన్ ఎల్లసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు యోగా గురువు సూచనల మేరకు తాడాసనం, వృక్షాసనం, త్రికోణాసనం, భుజంగాసనం తదితర యోగాసనాలను ప్రదర్శించారు.యోగాసనాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.అనంతరం కళాశాల యాజమాన్యం తరఫున యోగా గురువు ఎం.నాగేశ్వరరావును శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు జిల్లాలోని ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ

## కోరుతూ జిల్లా కలెక్టర్ కు ఇండియన్ రిపోర్టర్ అసోసియేషన్ (ఐఆర్ఏ) వినతి.

**సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా..జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీపై ఆశలు.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లాలో అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఇండియన్ రిపోర్టర్ అసోసియేషన్ నాయకులు జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాకు వినతిపత్రం అందజేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి జాషువా బాబు,రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్ బాబు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ బాబు,నంద్యాల జిల్లా అధ్యక్షుడు లెజెండ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..జర్నలిస్టులు ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం,ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం,సమాజంలో జరిగే అనేక అంశాలను నిష్పాక్షికంగా ప్రజలకు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు.అయితే ప్రస్తుతం చాలా మంది జర్నలిస్టులు తక్కువ వేతనాలతోనే కుటుంబాలను పోషించుకుంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తున్నప్పటికీ అధిక ఫీజులు భారంగా మారుతున్నాయని కలెక్టర్ కు వివరించారు.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జర్నలిస్టుల పిల్లలకు ప్రత్యేక రాయితీలు కల్పించిన విషయాన్ని ప్రస్తావిస్తూ,నంద్యాల జిల్లాలో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని కోరారు.

వినతిపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా సానుకూలంగా స్పందించినట్లు ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు.జిల్లాలోని ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి, జిల్లాలో అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకుంటామని,సోమవారం దీనిపై నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా అసోసియేషన్ నాయకులకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం జిల్లా యంత్రాంగం తీసుకోబోయే ఈ నిర్ణయం వృత్తిలో ఉన్న కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు జర్నలిస్టులు, ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# యూరియా రైతులకు పంపిణీ చేసిన,

**గ్రామ అధ్యక్షులు డబ్బా ఈరన్న**





నందవరం పల్లె వెలుగు జూన్ 20 నందవరం మండలంలో కనక వీడు గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేయడం జరిగింది ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ అధ్యక్షులు డబ్బా ఈరన్న ఆధ్వర్యంలో పంపిణీ చేశారు గ్రామంలో యూరియా కరువులేకుండా చూస్తామని ఆయన అన్నారు అదేవిధంగా ప్రతి ఒక్కరికి ప్రతి రైతుకి అందరికీ అందిస్తామని కూటమి ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలుగా సహకరిస్తామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ అగ్రికల్చర్ ఆఫీసర్ రఘువీరా, కానిస్టేబుల్ మారెప్ప ,డీలర్లు నరసింహులు, దుబ్బన్న, మోజెస్ కాషారం హనుమంతు, మాన్దొడ్డి ఈరన్న, పురుషోత్తం నల్ల రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి.

**పిల్లల సమగ్ర వికాసానికి అంగన్‌వాడీలు వేదికలు : జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం నంద్యాల పట్టణం బొగ్గులైన్ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి, ప్రభుత్వం అందించిన సదుపాయాల వినియోగం, చిన్నారులకు అందుతున్న సేవలు, పోషకాహార పంపిణీ విధానాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బొగ్గులైన్ అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రత ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులను పాఠశాల విద్యకు సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. చిన్నారులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతంగా ఎదగాలంటే వారిని క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1663 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించబడుతున్నాయని, ఈ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులకు పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించేందుకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వం ప్రత్యేకంగా యుటెన్సిల్స్ కిట్‌తో పాటు ఇండక్షన్ స్టవ్‌లను అందించిందన్నారు. ఇంధన పొదుపు, సురక్షిత వంట విధానాలను ప్రోత్సహించే దిశగా ఇండక్షన్ స్టవ్‌ల వినియోగాన్ని అన్ని కేంద్రాల్లో అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు పాలు, గుడ్లు, పోషకవిలువలు అధికంగా ఉన్న ఆహారాన్ని క్రమం తప్పకుండా అందిస్తున్నామని సిబ్బంది కలెక్టర్ కు నివేదించారు. అంతేకాకుండా ఆటలు, పాటలు, ప్రాథమిక అభ్యాస కార్యక్రమాల ద్వారా పిల్లల్లో మానసిక, శారీరక వికాసాన్ని పెంపొందిస్తూ, ప్రాథమిక విద్యకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామని కలెక్టర్ కు వివరించారు.

# ఓటర్ల సర్వే పై వైఎస్ఆర్సిపి ఏజెంట్లకు అవగాహన



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 20: ఓటర్ల సమగ్ర సర్వేపై వైఎస్ఆర్సిపి ఏజెంట్లకు ఆ పార్టీ నాయకులు అవగాహన కల్పించారు. శనివారం మండల పరిధిలోని గాలి చెన్నయ్యపాలెం, నారాయణపురం చిన్నదేవలా పురం,లింగాపురం, సంత జూటూరు గ్రామాలలోని వైయస్సార్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షులు దే రెడ్డి సంజీవరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ బారెడ్డి సంజీవరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్లు అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి ఏజెంట్లతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ లో ప్రతి ఓటు నూతనంగా నమోదు చేయడం జరుగుతుందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. గతంలో తమకు ఓటు ఉందిలే అన్న విషయంపై నిర్లక్ష్యంగా ఉంటే అది గల్లంతు అయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతిబిల్ ఏ ఎస్ ఐ ఆర్ ఫై ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైయస్సార్ పి సానుభూతిపరుల ఓట్లను ఎక్కువగా తొలగించే పరిస్థితిలు ఉన్నాయి కాబట్టి, ప్రతి కార్యకర్త ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రాగాల రమణ, సగిలె కృష్ణారెడ్డి, గోపి రెడ్డి వెంకట్ రెడ్డి,భూమా రవి,విష్ణువర్ధన్, శివశంకర్, బలరామిరెడ్డి నరెద్దుల సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు శాఖమూరి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో

- అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి
- చిన్నారులకు ఓ నామాలు నేర్పిస్తున్న
- ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి

ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 20 ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజల భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర (ాూాూా) కార్యక్రమం నిరంతరం ముందుకు సాగుతోందని ఎమ్మిగనూరు శాసనసభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, పీఏసీ సభ్యులు డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మిగనూరు పట్టణంలోని 12వ వార్డు మారెమ్మకొండ సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి సందర్శించారు. అక్కడ చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, వంటగది, బాత్రూమ్‌లు, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.



అనంతరం అంగన్వాడీ వంటగదిలో భోజన ఏర్పాట్లలో స్వయంగా పాల్గొని, అంగన్వాడీ సిబ్బందితో కలిసి చిన్నారులకు భోజనం వడ్డించి ఆప్యాయంగా తినిపించారు. అనంతరం విద్యార్థులు, అంగన్వాడీ సిబ్బంది, స్థానిక ప్రజలతో కలిసి పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం పట్ల సామాజిక బాధ్యతను పెంపొందించేలా పరిశుభ్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, సామాజిక భాగస్వామ్యాన్ని ప్రభుత్వం










చురుగ్గా ప్రోత్సహిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన “స్వచ్ఛాంధ్ర ఆరోగ్యాంధ్ర ఐశ్వర్య ఆంధ్ర” లక్ష్యాన్ని సాకారం చేయడానికి ప్రజలందరినీ భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్, గంగిరెడ్డి, సిడిపిఓ, సఫర నిస్న బేగం, అంగన్వాడీ టీచర్, ఆయా, 12వ వార్డు ఇన్‌చార్జి, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో

## అంతర్జాతీయ యోగా దినోత్సవం

నంద్యాల .జూన్ 20. (పల్లె వెలుగు ): నెరవాడ: స్థానిక శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సుబ్రహ్మణ్యం తెలిపారు.యోగా అనేది కేవలం ఆసనాలు కాదు.మన జీవన విధానం, ఇప్పుడు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న ఒక ఘనమైన కార్యక్రమం.





శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతగానో దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఏడాది “ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి యోగ అనే ప్రధాన ఇతివృత్తంతో యోగా దినోత్సవాన్నిజరుపుకుంటున్నామని, వయసుతో సంబంధం లేకుండా అందరూ ఆరోగ్యంగా జీవించడానికి యోగా ఒక అద్భుతమైన మార్గమని తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యాలనుపెంపొందించడంలో, శ్వాస కోస సంబంధమైన ఆరోగ్యం కోసం రకరకాల ప్రాణాయామాలు, బ్రీథింగ్ ఎక్సర్‌సైజులు వాటికి యోగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ప్రతి రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా అందమైన శరీరాన్ని కూడా పొందవచ్చని, యోగా మన జీవితంలో భాగమవ్వాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఓ డి లు, ఫాకల్టీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.

# దిక్కులేని అభాగ్యులకు అన్నదానం



నంద్యాల బ్యూరో. జూన్ 20. (పల్లె వెలుగు ):భాను స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు లయన్ దనాల రవికాంత్ బాబు ఆధ్వర్యం లో మారుడి పూడి సత్తిబాబు జన్మదినం సందర్భం గా శనివారం దిక్కులేని అభాగ్యులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం చేసిన దాత దనాల గంగారాజు వీరికి హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.భాను స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు రవికాంత్ బాబు మాట్లాడుతూ సత్తిబాబు జన్మదినం మా అందరికీ పండుగ దినం, కావున ఈరోజు దిక్కులేని అభాగ్యులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాల సంతోషంగా ఉంది, ముఖ్యం గా దాతలు మానవత్వంతో ముందుకు వచ్చి వారి వంతు సహాయ సహకారం అందిస్తే పేదలకు మరిన్ని సేవ కార్యక్రమాలు చేయడానికి భాను స్వచ్ఛంద సంస్థ ముందు ఉంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమం లో సభ్యులు సిద్దిక్, విజయ పాల్, జయరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



మహానంది, పల్లె వెలుగు రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని కూటమి నేతలు పేర్కొన్నారు. శనివారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో అన్నదాత సుఖీభవ పిఎం కిషన్ 2026-27 మొదటి విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 4వేల 200మంది రైతులకు రూ. 2. 84 కోట్ల చెక్కును మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, మండల కన్వీనర్ కంచర్ల శివయ్య, మండల క్లస్టర్ ఇన్చార్జి నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ఉల్లి మధు, నాయకులు శశికళ కొండారెడ్డి,లక్ష్మీనారాయణ, రవి స్వామి, హరి ప్రసాద్ రెడ్డి, కిరణ్ కుమార్ గౌడ్,నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీకి ఎంపికైన యువకుడికి సన్మానం



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన ఎస్.జి. బషీర్ బాషా భారత ఆర్మీ జీడీ జనరల్ డ్యూటీ విభాగానికి ఎంపిక అయి మధ్యప్రదేశ్ లోని భూపాల్ లో శిక్షణకి వెళ్తుండడంతో ఘనంగా సన్మానించారు. శనివారం గాజులపల్లెలోని తెదేపా కార్యాలయంలో నాయకురాలు శశికళ కొండారెడ్డి పూలమాల, శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. దేశ సేవ చేయాలని సంకల్పంతో కష్టపడి చదివి తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని యువతకి ఆదర్శంగా నిలిచారన్నారు.

# ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు



హోళగుంద పల్లె వెలుగు జూన్ 20 తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు కుమార్తె, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, హెరిటేజ్ సంస్థ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి 66వ జన్మదిన వేడుకలను హోలగుంద మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఈబీజీ గోవింద్ గౌడ్, యువనాయకులు ఈబీజీ రాజేంద్ర గౌడ్, ఈబీజీ భువనేశ్వరి గౌడ్, ఈబీజీ లక్ష్మీనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నారా భువనేశ్వరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళా సాధికారత, సేవా కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం పట్ల ఆమె చూపుతున్న అంకితభావం ఆదర్శప్రాయమని కొనియాడారు. పార్టీకి, నాయకత్వానికి ప్రతి క్లిష్ట సమయంలో అండగా నిలుస్తూ తెలుగు ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న గొప్ప వ్యక్తిత్వం కలిగిన నాయకురాలని పేర్కొన్నారు.అనంతరం నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకొని జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. నారా భువనేశ్వరి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో దీర్ఘకాలం ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పంపతి, యరిస్వామి, మైనారిటీ నాయకులు డీఎస్ బాషా, దిడి వెంకటేష్, జనసేన మండల కన్వీనర్ అశోక్, రామాంజి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కామ్రేడ్ తారకనాథ్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం,

**☛ఎస్‌బీఐ యూనియన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం,,,,**



ఎమ్మిగనూరు, పల్లె వెలుగు జూన్ 20 ఎస్‌బీఐ యూనియన్ నాయకుడు కామ్రేడ్ తారకనాథ్ 22వ వర్ధంతి సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో ఎస్బిఐ ఎమ్మిగనూరు, కోసిగి, గోనేగండ్ల మూడు బ్రాంచ్ మేనేజర్ ల ఆధ్వర్యంలో ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ నందు శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని



స్వచ్ఛందంగా 80 మంది పైగా రక్తదానం చేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, కామ్రేడ్ తారకనాథ్ కార్మిక హక్కుల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.రక్తదానం చేసిన దాతలకు నిర్వాహకులు అభినందనలు తెలియజేసి, రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో కామ్రేడ్ తారకనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా ఉద్యోగులు రమేష్ సాగర్ వసంత, రాజేశ్వరి,పవన్ కుమార్,మహేష్, మహేష్ కుమార్,రాజశేఖర్, నరసప్ప,వివేకనంద స్వామి స్వచ్ఛంద సంస్థ సభ్యులు తిరుమలు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ భార్గవి, దొరబాబు, అశోక్, సురేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# నీట్-యూజీ 2026 పునఃపరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు.

**జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ సాయి ప్రసాద్ వీడియో సమీక్ష.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఈనెల 21న నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 పునఃపరీక్ష ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.
నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కలెక్టర్ ఛాంబర్ నుంచి వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 65,790 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, వారి కోసం 185 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల రవాణా మరియు భద్రపరచడంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీటీవీ నిఘాలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలని స్పష్టం చేశారు.
ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నందున పరీక్షా కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేయడంతో పాటు అవసరమైతే ఇంటర్నెట్ సేవలను నియంత్రించాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులకు అదనంగా ఒక గంట సమయం కల్పించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని ఫోటోకాపీ కేంద్రాలు, సైబర్ కేఫ్‌లు, కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.



సోషల్ మీడియాలో పేపర్ లీకేజీ వంటి తప్పుడు ప్రచారాలు, వదంతులు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నకిలీ గుర్తింపు కార్డులు లేదా ఇతర అక్రమ మార్గాల ద్వారా పరీక్ష రాసేందుకు ప్రయత్నించే వారిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ సాయి ప్రసాద్ స్పష్టం చేశారు.

# ఆరోగ్య ప్రదాత -- సూర్య నమస్కారాలు

పల్లె వెలుగు: తూర్పు కొండల వెనుక నుంచి



బంగారు కిరణాలతో భానుడు ఉదయించగానే ప్రకృతి పులకిస్తుంది. ఆ సమయంలో ప్రారంభమయ్యే సూర్య నమస్కారాలు ఆరోగ్య యోగానికి ప్రతీక. ద్వాదశ ఆసనాల సమాహారమైన ఈ సాధన శరీరానికి నవచైతన్యాన్ని అందిస్తుంది. శ్వాసపై దృష్టి నిలిపి సూర్య నమస్కారాలు చేస్తే మానసిక అలసట, కుంగుబాటు దూరమవుతాయి.
*ప్రణామాసనంతో ప్రారంభమై భుజంగాసనం, పాదహస్తాసనం వంటి భంగిమలతో కొనసాగే ఈ యోగ సాధన వెన్నెముకను దృఢంగా ఉంచి, హార్మోన్ల సమతుల్యతను కాపాడుతుంది. ఫలితంగా ఉల్లాసం, ఉత్సాహం పెరిగి వ్యాకులత తగ్గుతుంది. సూర్య నమస్కారాలు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సమతుల్యతను కలిగించే సంపూర్ణ ప్రక్రియ.*
సూర్య నమస్కారాల వల్ల శరీరంలోని అదనపు కొవ్వు కరిగి బరువు తగ్గుతుంది. జీర్ణక్రియ మెరుగుపడి మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. రక్తప్రసరణ సక్రమంగా జరిగి ప్రతి అవయవానికి ఆక్సిజన్ సమృద్ధిగా అందుతుంది. వెన్నెముక దృఢంగా మారి నడుము నొప్పులు తగ్గుతాయి. చేతులు, కాళ్లు, ఛాతీ, భుజాల కండరాలు బలపడతాయి. నరాల వ్యవస్థ ప్రశాంతమై మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. శ్వాసపై ఏకాగ్రత పెరగడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగవుతాయి. మంచి నిద్రకు కూడా ఇది తోడ్పడుతుంది. గుండె పనితీరు మెరుగుపడి, హార్మోన్ల సమతుల్యత కాపాడబడుతుంది. ముఖ్యంగా మహిళల్లో రుతుచక్రం క్రమబద్ధీకరణకు సహాయపడుతుంది. రక్తప్రసరణ పెరగడం, చెమట ద్వారా విషపదార్థాలు బయటకు వెళ్లడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. జఠరాగ్ని చురుకుగా పనిచేసి నరాల బలహీనత తగ్గుతుంది. కండరాలకు పుష్టి చేకూరుతుంది. ఆలస్యాన్ని తరిమికొట్టి ఉత్సాహాన్ని నింపే అద్భుతమైన దివ్యౌషధం సూర్య నమస్కారాలు. వాటిని నిత్యం ఆచరిద్దాం. ఆరోగ్య భారతాన్ని నిర్మిద్దాం. ఆదిత్యుని కరుణాకటాక్షంతో నూరేళ్ల ఆయుష్షు పొందుదాం.
(జూన్ 21 అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా) నేదునూరి కనకయ్య ధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోర మాజీ ఎన్ఎస్ఎస్ అధికారి, కాలమిస్ట్, రచయిత కరీంనగర్.

# కూటమి ప్రభుత్వంలో పోలీసులు రాజకీయ తొత్తులుగా మారారు.


**వైసీపీ లీగల్ సెల్ .**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో పోలీసులు రాజకీయ తొత్తులుగా మారారని నంద్యాల లీగల్ సెల్ నాయకులు సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం నంద్యాలలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ లీగల్ సెల్ ప్రతినిధుల సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో నంద్యాల జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, నంద్యాల అధ్యక్షుడు ప్రతాప్రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు స్టేట్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ తిమ్మారెడ్డి, ఆర్టీఏ నంద్యాల అసెంబ్లీ వింగ్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రీవెన్స్ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు వివేకానందరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ జగన్ మోహన్ రెడ్డి, సాయిరాం రెడ్డి, మదాని, సోహేల్ రాణా, ద్వారకానాథ్, శరత్, రామాంజనే యులు, వసంత్ రెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నంద్యాల వైసీపీ లీగల్ సెల్ నాయకులు మాట్లాడుతూ...రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో అరాచకాలు, దౌర్జన్యాలు, సోషల్ మీడియా ఆక్టివిస్టపై వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అనవరస కేసులు నమోదు చేస్తు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సమాజంలో పోలీసుల పాత్ర అత్యంత ప్రధానమైనదని, అయితే నేడు కూటమి ప్రభుత్వంలో వారు రాజకీయతొత్తులుగా మారారని సంచల వ్యాక్యలు చేశారు. ఇటీవల కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో కృష్ణవంశీ అనే యువకున్ని లాకప్ డెత్ జరిగిన ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి కృష్ణ వంశీ లాకప్ డెత్ గురించి తెలుసుకోవడం జరిగిందని అంతవరకు కనీసం స్పందించని పోలీసులు నేడు కృష్ణలంక సీఐపై కేసు నమోదు చేశారన్నారు. పోలీసు వ్యవస్థ రాష్ట్రంలో నిర్వీర్య అయ్యిందని విమర్శించారు. రాష్ట్రంలో మంత్రులు ఉన్నా అందరిని కేవలం మంత్రి లోకేష్ నియంత్రించడం జరుగుతుందని వారు పేరుకు మాత్రమే మంత్రులన్నారు. జూనియర్ న్యాయవాధుల విషయంలో నాడు వైసీపీ ప్రభుత్వం 5వేల రూపాయలను ఇవ్వడం జరిగిందని, అయితే ఎన్నికల సందర్భంగా జూనియర్ న్యాయవాధులకు నెలకు 10వేల రూపాయలు ఇస్తానని నమ్మించి నేటికి ఇవ్వలేదని మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను హామీలను నెరవేర్చలేదని పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాల్లో మోసాలు, రైతులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లేదని కేవలం వైసీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.

# గోరు మీద 20 రకాల
# సూక్ష్మ యోగాసనాల చిత్రాలు.

**బొటనవేలి గోరుపై 20 సూక్ష్మ యోగాసనాల చిత్రాలతో ఆకట్టుకున్న కోటేష్**



● ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా వినూత్న కళా ప్రదర్శన ● యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్న చిత్రకారుడు ● యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపు





**కేవలం10 నిమిషాల్లో మైక్రో పెన్‌తో అద్భుత సృష్టి**

నంద్యాల బ్యూరో. జూన్ 20. (పల్లె వెలుగు ): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు కళారత్న చింతలపల్లె కోటేష్ ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని వినూత్నంగా తన బొటన వేలి గోరు మీద మైక్రో పెన్ను తో 20 రకాల సూక్ష్మ యోగాసనాల చిత్రాలను వేసి అబ్బుర పరిచారు. ఈ సూక్ష్మ చిత్రాలన్ని కేవలం 10 నిముషాల వ్యవధిలో వేసారన్నారు. ఈ సందర్బంగా కోటేష్ మాట్లాడుతూ యోగా ప్రతి రోజు చేయడం వలన శారీరకంగా, మానసికంగా బాగుంటుంది. మెరుగైన జీవన విధానం ఉంటుంది. ధ్యానం, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, యోగాసనాలు ఇవన్ని యోగాకు సంభందించినవే. యోగా ద్వారా ఒత్తిడిని జయించవచ్చు. ఏకగ్రతను పెంచుతుంది. కండరాలు బలంగా వుండి శరీర సౌష్టం బాగుంటుంది. వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు ఇలా ఎన్నో ధీర్ఘ కాలిక వ్యాధుల నుండి ఉపశమనం ఉంటుంది. అలాగే ధ్యానం, ప్రాణాయామం ద్వారా మనసును ప్రశాంత పరచి, మానసిక ఒత్తిడి తగ్గించి ఆరోగ్యంగా జీవిస్తారు. శ్వాస కోశ వ్యాధులు దరికిరావు. మంచి నిద్ర వస్తుంది. యోగా వలన ఎన్నో ప్రయోజనాలు కాబట్టి ప్రతి ఒక్కరు దినచర్యలో భాగంగా యోగా ను చేర్చుకోండి ఆరోగ్యంగా జీవించండి.

## పోలీస్ స్టేషన్లలో సామాన్యులకు సత్వర న్యాయం అందించాలి .

-సిపిఐ డిమాండ్.




పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో ఇటీవల జరుగుతున్న కొన్ని సంఘటనలపై పోలీస్ వ్యవస్థ స్పందిస్తున్న తీరు పట్ల శనివారం ఒక ఉమ్మడి ప్రకటనలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ లు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. పట్టణంలో వివిధ రకాల సంఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ, పోలీసులు వాటిపై మరింత వేగంగా స్పందించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం పట్టణంలో దొంగతనాలు, హత్యలు, అత్యాచారాలు, భూ ఆక్రమణలు వంటివి ఎన్నో జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన తర్వాత తమకు సరైన న్యాయం జరుగుతుందో లేదోననే సందేహంతో, చాలా మంది మధ్యలోనే కేసులు వదిలేసే పరిస్థితి వస్తోందన్నారు. పోలీసులు కేసులను సరిగా పట్టించుకోకపోవడం వల్లే నిందితులకు సరైన శిక్షలు పడడం లేదని, దీనివల్ల బాధితులు మరింత భయపడుతున్నారని వారు పేర్కొన్నారు. సామాన్యునికి ఖచ్చితంగా న్యాయం జరుగుతుందనే గట్టి భరోసాను పోలీసులే స్వయంగా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శాంతిభద్రతల విభాగం త్వరితగతిన స్పందిస్తేనే సామాన్య ప్రజలకు రక్షణపై నమ్మకం కలుగుతుందని, అప్పుడే సామాన్యులు సైతం ఎలాంటి భయం లేకుండా స్టేషన్లకు వచ్చి తమ సమస్యలను చెప్పుకోవడానికి ముందుకు వస్తారన్నారు. లేనిపక్షంలో సాధారణ ప్రజలు న్యాయం కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లలో కింది స్థాయి సిబ్బంది వరకు అసలు ఏమి జరుగుతుందనే విషయంపై జిల్లా స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక స్టేషన్ల పనితీరుపై ఉన్నతాధికారులు నిఘా ఉంచితేనే క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలు బయటకు తెలుస్తాయని వారు అభిప్రాయపడ్డారు. ?బాధితులతో ఉన్నతాధికారులు స్వయంగా కలిసి మాట్లాడినప్పుడు మాత్రమే వారికి వ్యవస్థపై పూర్తి భరోసా కల్పించినట్లు అవుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు నంద్యాల పట్టణంలో జరుగుతున్న పరిణామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పోలీస్ వ్యవస్థను మరింత చురుగ్గా మారుస్తూ సామాన్యులకు సకాలంలో న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు ఈ సందర్భంగా కోరారు.

## కే. తిమ్మాపురం గ్రామంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన

**అన్నదాత సుఖీభవ పథకం 2026-27 మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమంలో**

ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి




ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 20 రైతులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అనంతరం గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రసంగాలను ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించారు. ఈ సందర్భంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో పీఎం కిసాన్ రూ. 2,000తో పాటు అన్నదాత సుఖీభవ రూ. 5,000, 2026 - 27 మొదటి విడతగా మొత్తం రూ. 7,000 నిధులు జమ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ నిధులను విడతల వారీగా రైతులకు అందిస్తున్నామని చెప్పారు. 3,125.47 కోట్లు రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని, ఈ విడతలో ?7,000 విడుదల చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ?14,000 అన్నదాత సుఖీభవతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ?6,000 పీఎం కిసాన్ నిధులతో కలిపి ప్రతి రైతుకు మొత్తం ?20,000 ఆర్థిక సహాయం అందిస్తూ రైతు పక్షపాత ప్రభుత్వమని మరోసారి నిరూపించామని తెలిపారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 38,318 మంది రైతులకు ?25.63 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చంనాయుడుకి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. దేశానికి అన్నం పెట్టే రైతు సంతోషంగా ఉంటేనే సమాజం సుభిక్షంగా ఉంటుందని, రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు చరిత్రలో నిలవలేదని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు వారిని 11 స్థానాలకే పరిమితం చేశారని విమర్శించారు. గ్రామంలోని పలు ప్రాంతాలను సందర్శించి పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజ్ సమస్యలు మరియు సంక్షేమ పథకాల అమలుపై అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పార్టీ కార్యకర్తలతో సమావేశమై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్లు, వ్యవసాయ శాఖ ఏడీ, ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది, పార్టీ మండల కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామ కార్యకర్తలు మరియు రైతులు పాల్గొన్నారు.





## రెండేళ్ల విజయోత్సవ సంబరాల్లో వైకుంఠం జ్యోతి జన్మదిన వేడుకలు





హోళగుంద పల్లె వెలుగు జూన్ 20 కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలూరులో నిర్వహించిన రెండేళ్ల విజయోత్సవ సభ అనంతరం ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు గుడిసె కృష్ణమ్మ హాజరై జ్యోతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఈబీజీ గోవింద్ గౌడ్, యువనాయకుడు ఈబీజీ రాజేంద్ర గౌడ్ కలిసి గుడిసె కృష్ణమ్మను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్‌ను ఈబీజీ గోవింద్ గౌడ్ శాలువాతో సన్మానించి, పార్టీ అభివృద్ధికి అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఈబీజీ గోవింద్ గౌడ్, సీనియర్ నాయకులు పంపతి, యరిస్వామి తదితరులు కలిసి వైకుంఠం జ్యోతికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, పూలహారాలతో ఘనంగా సన్మానిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజా సేవలో ముందుండి పనిచేస్తున్న వైకుంఠం జ్యోతి ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

## రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

**-- కర్నూలు పోలీసుల ప్రత్యేక చర్యలు.**





పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారి ఆదేశాల మేరకు ప్రతి శనివా రం రోడ్డు భద్రతపై పోలీసు అధికారులు అవగా హన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2026 జనవరి 1 నుంచి జూన్ 19 వరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి పై జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేప ట్టారు. నమోదైన కేసులు:ఓవర్ స్పీడ్ -- 4,106 హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ -- 3,145సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ -- 1,089, డ్రంకెన్ డ్రైవింగ్ -- 4,258 ఓపెన్ డ్రింకింగ్ -- 7,963, మైనర్ డ్రై వింగ్ - 52, ట్రిపుల్ డ్రైవింగ్ - 286, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హె ల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మ ద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. రోడ్డు భద్రతపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవగా హన కార్యక్రమాలు నిర్వ హించారు.

## దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలి.

బీసీ సంక్షేమ హాస్టల్ లో దరఖాస్తు చేసిన ప్రతి ఒక్క విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలి ఎస్ఎఫ్ఐ



ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు భారతి విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ హాస్టల్ లో దరఖాస్తు చేసిన ప్రతి ఒక్క విద్యార్థికి హాస్టల్ లో వసతి కల్పించాలని ఆదోని పట్టణంలో సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి (ఏ బి సి డబ్ల్యూ ఓ) మాదప్ప వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సంజయ్, శశిధర్ మాట్లాడుతూ బీసీ హాస్టల్ లో విద్యార్థులకు హాస్టల్లో సీట్లు లేకపోవడం వల్ల విద్యను మధ్యలోనే ఆపేసిన పరిస్థితి కనబడుతుంది ఆదోని వెనుకబడిన ప్రాంతం కావున పేద విద్యార్థులు దిష్టిలో ఉంచుకొని హాస్టల్లో దరఖాస్తు చేస్తున్న ప్రతి ఒక్క విద్యార్థికి హాస్టల్ సిటీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం అదేవిధంగా బీసీ హాస్టల్ లో ప్రతినెల మెడికల్ క్యాంప్ నిర్వహించాలని అదేవిధంగా బిసి హాస్టల్ లో నెలకున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు బీసీ హాస్టల్ సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వీరేష్ ,లోకేష్ , ఉత్తేజ్, చిరు, ఉమాకాంత్, రాజు, మహేష్, హేమంతు, పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ జాబితా ప్రత్యేక సవరణపై అవగాహన సదస్సు.

కార్యక్రమాన్ని నిర్వహించిన బిజెపి సీనియర్ నాయకుడు మధుసూదన్ శర్మ.





ఆదోని (పల్లె వెలుగు): ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై అమరావతి నగర్ 35వ వార్డు అమరావతి నగర్ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు మధుసూదన్ శర్మ తెలిపారు. స్థానికంగా మహిళలతో, యువతతో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో మధుసూదన్ శర్మ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లు నమోదు, తప్పుల సవరణ, తొలగింపులు, చిరునామా మార్పుల ప్రక్రియపై వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే సచివాలయ సిబ్బంది కూడా ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అర్హులందరికీ ఓటు హక్కు దక్కుతుందని పేర్కొన్నారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే సమావేశానికి పెద్ద ఎత్తున యువకులు, మహిళలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో బిజెపి బిఎల్వోలు పరుశురాం, చరణ్,ఆర్పీలు ఫాతిమా,చంద్రకళ పాల్గొన్నారు.

## గడివేముల పోలీస్ స్టేషన్లో లిస్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర..

గడివేముల ఎస్సై సి సి నాగార్జున రెడ్డి..




పల్లెవెలుగు దినపత్రిక గడివేముల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డి.జి.పి గౌరవ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ ఉత్తర్వులతో, నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు పరిశు భ్రమైన,ఆరోగ్యకరమైన వాతావరనన్నీ ఏర్పాటు చెయ్యడమే లక్షంగా నేడు గడివేముల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ నాగార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పోలీసు సిబ్బంది తమ కార్యాలయాలు మరియు చుట్టు పక్కల ప్రాంగణాలను సమగ్రంగా పరిశుభ్రం చేశారు. ఎస్సై మాట్లాడుతూ మాట్లాడుతూ విధులు నిర్వహించే చోట వాతావరణాన్ని పరి శుభ్రంగా ఉంచుకోవడం సిబ్బంది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మన ఇంటిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటామో అదేవిధంగా పనిచేసే చోటా పరిశు భ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలని తద్వారా అనారోగ్య సమస్యలు విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని,ప్రజలలో పరిశుభ్రతపై చైతన్యం తీసుకొని రావడమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తూ పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు.

## ఉద్యోగాల కోసం రోజూ వెయ్యి మంది వస్తున్నారు

నల్గొండ జిల్లా ప్రతినిధి -- ఉద్యోగాలు లేక అనేక మంది యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ ప్రతిరోజూ దాదాపు వెయ్యి మంది తమ నివాసానికి వస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం నల్గొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ప్రభుత్వ బాలుర మరియు ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాలను సందర్శించిన మంత్రి అనంతరం కళాశాల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. యువత భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని పేర్కొంటూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని మంత్రి ఆకాంక్షించారు. .

## స్వర్గధామం వైకుంఠ రథం కోసం పదిలక్షలు సహాయం చేసిన గోళ్ళ రాజేష్



నంద్యాల బ్యూరో. జూన్ 20. (పల్లె వెలుగు ):నంద్యాలలో భీమవరం రాస్తాలో మరియు బస్టాండ్ దగ్గర నంద్యాల నవనిర్మాణ సమితి నిర్వహిస్తున్న రెండు హిందూ స్మశాన వాటికలను స్వర్గధామం" అన్న పేరుతో పది సంవత్సరాల నుంచి జీర్ణోద్ధరరణ చేసి నిర్వహణ చేస్తున్న విషయం మీకు అందరికీ తెలుసు. అందులో మానవతా సంస్థ వాళ్ళు ఇచ్చిన వైకుంఠ రథం ఒకటే ఉన్నది. నంద్యాల చుట్టుపక్కన 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లెటూర్లకు కూడా ఫ్రీజర్ బాక్స్, వైకుంఠ రథం సేవలను పెంపొందించుటకు మేము అడగగానే స్పందించి మృతి చెందిన ప్రతి హిందువు యొక్క ఆత్మను బ , ´ గ ´ వ ం త ´ ౦ ని ల ో వ ం చ భ ూ తా ల లో ఐ క్య మ ు య్యే టు వ ం టి స్వర్గధామానికి రెండవ వైకుంఠ రథం ఇవ్వడానికి ముందుకు వచ్చి వెంటనే స్పందించి పది లక్షల రూపాయల చెక్కును మధుమణి నర్సింగ్ హోమ్ నందు స్వర్గధామం సభ్యులకు అందచేయడం జరిగింది. గోళ్ళ రాజేష్ విశాల హృదయానికి, సమాజ సేవకు, నిష్కలంకమైన హృదయానికి నిదర్శనం. గోళ్ళ రాజేష్ చేస్తున్నటువంటి ఈ సేవా కార్యక్రమానికి నంద్యాల నవనిర్మాణ సమితి సభ్యులు అందరం కూడా కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు చెబుతున్నారు. ఈ సమావేశంలో స్వర్గధామం అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,ఉపాధ్యక్షులు రాజశేఖర్ , ఉపాధ్యక్షులు శేషుబాబు, కార్యదర్శి గెలివి రామకృష్ణ , ట్రెజరర్ కశెట్టి కృష్ణమూర్తి, ద్వారకా వసంతు, షణ్ముఖ శ్రీనివాస్ ఇంకా స్వర్గధామం సేవకులు కూడా పాల్గొనడం జరిగింది.

## అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా




బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 20: వెలుగోడు మండల కేంద్రంలో శనివారం అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కింద 5827 మంది రైతులకు విడుదలైన మూడు కోట్ల 96 లక్షల రూపాయల చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులతో ఎమ్మెల్యే చర్చించారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బుడ్డా పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కింద రైతులకు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సాయం నేరుగా రైతు ఖాతాలోకి జమవుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

**బండి ఆత్మకూరులో**

బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అధ్యక్షతన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మొదటి విడత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సొంత భూమి కలిగిన 7690 మంది రైతు కుటుంబాలకు మరియు ఆర్ఓఎఫ్ ఆర్ భూమి కలిగిన 44 మంది సాగుదారులకు ఐదు కోట్ల 32 లక్షల రూపాయలు విడుదల అయిందని చెప్పారు. ఈ నగదు పంట కాలంలో పెట్టుబడి సాయం కొరకు సాగుదారులకు మద్దతు ఇవ్వడానికి మూడు వాయిదాలలో రైతు కుటుంబానికి సంవత్సరానికి 20వేల రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వము అందిస్తుందని తెలిపారు. అర్హత కలిగిన అన్ని రైతు కుటుంబాలకు మరియు ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూమి షాపుదారులకు మొదటి విడుదల 5000 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా, పీఎం కిసాన్ పథకం కేంద్ర ప్రభుత్వం ద్వారా రెండు వేల రూపాయలు కలిపి మొత్తం 7000 రూపాయలు రైతుల ఖాతాలకు విడుదలైన తెలిపారు. మండల సిరిసిల్ల ఆఫీసర్ లీలావతి మాట్లాడుతూ రానున్న ఎల్ నైనో పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలైన పెసర మినుము పంటలు వేసుకోవాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గాయత్రి తో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేర నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యం

- రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం

- రాత్రి వేళల్లో కొనసాగుతున్న విజిబుల్ పోలీసింగ్
- చీజుజు పరీక్ష ప్రశ్నపత్రాల భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక తనిఖీలు.







పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం 'విజిబుల్ పోలీ సింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్ర మంలో భాగంగా నేరాల నియం త్రణకు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై తనిఖీలు నిర్వహి స్తూ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెం పొందించే చర్యలు చేపడుతు న్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు కట్టుదిట్టంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిం చారు. కర్నూలు నగరంలో కర్నూలు మూడవ పట్టణ సిఐ శేషయ్య ఆధ్వర్యంలో బ్లూ కోల్ట్స్, క్యూఆర్టీ పోలీసు బృందాలు విస్తృత తని ఖీలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు కూడా చేపట్టారు. అదేవిధంగా రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని నిర్వహి స్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. చీజుజు పరీక్షల నిర్వహణ నేపథ్యంలో ప్రశ్నపత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ భద్రపరిచిన చీజుజు పరీక్ష ప్రశ్నపత్రాల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా చర్యలను తనిఖీచేసి, విధుల్లో ఉన్న సిబ్బం దికి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందిం చాలని కోరారు. అత్యవసర పరి స్థితుల్లో డయల్-112 లేదా డయ ల్-100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ప్రశాంత వాతావరణంలో మొహరం పండుగ జరుపుకోండి..

పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి. ఎస్సై సి సి నాగార్జున రెడ్డి,





గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా గడివేముల మండలం పెసరవాయి గ్రామంలో మొహరం పండుగ సందర్భంగా పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, గడివేముల ఎస్సై సి సి నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అల్లర్లు సృష్టించకుండా పోలీస్ వారికి సహకరించి పండగ జరుపుకోవాలని కమిటీ వారికి గ్రామ ప్రజలకు సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మొహరం (పీర్ల పండుగ) త్యాగానికి, పవిత్రతకు మరియు మత సామరస్యానికి ప్రతీక. ఈ పండుగను ప్రశాంత వాతావరణంలో, అందరూ కలిసికట్టుగా జరుపుకోవడానికి కొన్ని సూచనలు పాటించండి:మత సామరస్యం: కుల, మతాలకు అతీతంగా అందరూ కలిసి పీర్ల ఊరేగింపులలో శాంతియుతంగా పాల్గొనండి. శాంతి భద్రతలు: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలకు తావివ్వకుండా, పోలీసు అధికారులు మరియు పెద్దల సూచనలను పాటించండి. సంయమనం: అలాయ్ తొక్కే కార్యక్రమాలలో సంయమనం పాటించండి, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దు. పర్యావరణ పరిరక్షణ: సంప్రదాయాల పేరిట పచ్చని చెట్లను నరకవద్దు. పర్యావరణానికి హాని కలగకుండా పండుగను ఆచరించండి. సేవ మరియు దానం: ఈ పవిత్ర మాసంలో పేదలకు దానధర్మాలు చేయడం, ఉపవాసాలు ఉండడం వంటి మంచి పనులతో రోజులను గడపండి. మీరు మొహరం సందర్భంగా మీ ప్రాంతంలో జరిగే ప్రత్యేక ప్రార్థనలు లేదా పీర్ల ఊరేగింపు జరిగేటప్పుడు అందరూ కలిసికట్టుగా ఉంటే ఎలాంటి అల్లర్లు జరగవు గ్రామ పెద్దలు కమిటీ వారికి కొన్ని సూచనలు తెలిపారు. మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే పోలీసు వారి చర్యలు తప్పవని ఎక్కడైనా గొడవలు సృష్టిస్తే వాటి గురించి పోలీసు వారికి తగిన సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఒకసారి కేసు నమోదు అయితే మీ భవిష్యత్తు మీ పిల్లల భవిష్యత్తు భంగం కలుగుతుందని, గొడవలకు దూరంగా ఉండి ప్రశాంత వాతావరణంలో పండగ జరిగే విధంగా చూడాలని గ్రామ ప్రజలకు పలు హెచ్చరికలు జారీ చేశారు,ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు..


### ఆర్డీఓ ఆఫీస్ ముందు బాధితురాలి నిరసన

# :"పది నెలల వేధింపులకు చరమగీతం పాడాలి!"

- గార్గేయపురం భూ వివాదంలో విచారణ పూర్తి -- తుది ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ యంత్రాంగం
- ఫోర్జరీ ఆరోపణలు నిరూపించలేకపోయిన పిటిషనర్ బైరెడ్డి హరిత.. రికార్డుల ఆధారంగా 'వెబ్ ల్యాండ్' లో గొల్ల లక్ష్మీనారాయణ పేరే ఖరారు
- తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని అధికారుల స్పష్టీకరణ


ప్రకటన

[illegible]



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

రెవెన్యూ డివిజనల్ కార్యాలయం (ఆర్డీఓ) వేదికగా గత కొంతకాలంగా సాగుతున్న గార్గేయపురం భూ వివాదం శనివారంతో ఒక కొలిక్కి వచ్చింది. న్యాయం కోసం పది నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానంటూ, శనివారం ఉదయం 11:30 గంటల నుండి సాయంత్రం వరకు వేచి చూసిన పిటిషనర్ బైరెడ్డి హరిత ఆర్డీఓ కార్యాలయం వద్ద తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మహిళనని కూడా చూడకుండా గంటల తరబడి నిరీక్షించేలా చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి మరియు జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**అసలు వివాదం ఏమిటి?**

కర్నూలు రూరల్ మండలం


O/o Revenue Divisional Officer,
Kurnool.

Rc.C/ROR/387/2026, Dated:11-06-2026

NOTICE TO THE PARTIES

BETWEEN:

B.Haritha
W/o Late B.Venkata Reddy ........ Petitioner

AND

Golla Lakshmi Narayana
S/o Golla Sunkanna ........ Respondent

Schedule Land: of Sy.No.619/3 (L.P.No. 711) - Extent Ac.1.63 cts of Gargeyapuram Village, Kurnool Rural Mandal

It is to inform that, the petitioner filed a case under section 5(5) of AP Record of Rights Pattadar and Passbook Act, 1971 on the above scheduled property. The case is posted on 20.06.2026 (Saturday) at 11.30 A.M. for personal hearing before the Revenue Divisional Officer, Kurnool.

Therefore, both petitioner and respondents are hereby directed to appear before the Revenue Divisional Officer, Kurnool on the above date and time withall relevant records and documents without fail. This shall be treated as the final notice to both parties. In the event of non-appearance, the matter will be decided based on the records available.

Further, the Tahsildar, Kurnool Rural, is directed to submit a factual report and summit connected revenue records for the scheduled land like RSR, RH, Old ROR, 10(1) Register, Manual Adangals, Present Online Adangal, enjoyment Sketch and Survey Records Pertaining to schedule lands.

I VENUGOPALA RAO
For Revenue Divisional Officer,
Kurnool.

To:
1. B.Haritha W/o Late B. Venkata Reddy, Gargeyapuram Village, Kurnool Rural Mandal.
2. Golla Lakshmi Narayana S/o Golla Sunkanna, Gargeyapuram Village, Kurnool Rural Mandal.
3. The Village Revenue Officer, Gargeyapuram Village.
4. The Tahsildar, Kurnool Rural Mandal.

Copy to the Tahsildar, Kurnool Rura Mandal with a direction to serve the notice to the petitioner and respondent to submit the served copy on before 15.06.2026 and directed to attend along with the records and detailed report.

గార్గేయపురం గ్రామానికి చెందిన సర్వే నంబర్ 619/3లోని 1.63 ఎకరాల భూమిపై గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. తన భర్త మరణాన్ని ఆసరాగా చేసుకుని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దొంగ పాసుపుస్తకాలు, ఫోర్జరీ రికార్డులు సృష్టించారని బైరెడ్డి హరిత ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయం నుండి తనకు అనుకూలంగా నివేదిక వచ్చినప్పటికీ, ఆర్డీఓ కార్యాలయంలో కేసును పదేపదే వాయిదా వేస్తూ కాలయాపన చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు.

**అధికారుల సమగ్ర విచారణ -- రికార్డుల పరిశీలన:** ఈ వ్యవహారానికి సంబంధించి శనివారం (20.06.2026) కర్నూలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో తుది నోటీసుల ఆధారంగా సుదీర్ఘ విచారణ జరిగింది. ఈ కేసులో ప్రతివాదిగా ఉన్న గొల్ల లక్ష్మీనారాయణ (వికలాంగుడు) విచారణకు హాజరై, తనకు సంబంధించిన ఒరిజినల్ పాస్ బుక్ మరియు పక్కా భూ పత్రాలను (డాక్యుమెంట్లను) అధికారులకు సమర్పించారు. మరోవైపు, ఈ భూమిపై 'మస్జిద్ రియల్ ఎస్టేట్' వారు కూడా హాజరై హైకోర్టులో తాము దాఖలు చేసిన డబ్ల్యూ.పి. 16138/2026 కేసు వివరాలను తెలియజేస్తూ, తదుపరి విచారణ ఈ నెల 22న ఉందని అధికారుల దృష్టికి తెచ్చారు. 'ఫోర్జరీ' ఆరోపణలకు ఆధారాలు లేవు -- ఆర్డీఓ ఉత్తర్వులు: పిటిషనర్ బైరెడ్డి హరిత ఆరోపిస్తున్నట్లుగా ప్రతివాది గొల్ల లక్ష్మీనారాయణ సమర్పించిన పాస్ బుక్స్ గానీ, రెవెన్యూ రికార్డులు గానీ ఫోర్జరీ అయినట్లు నిర్ధారించడానికి ఎలాంటి పక్కా ఆధారాలను పిటిషనర్ పక్షం విచారణలో సమర్పించలేకపోయింది. దీంతో రెవెన్యూ రికార్డులు, రీ-సర్వే నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన రెవెన్యూ డివిజనల్ అధికారి.. రిసెర్వే తదుపరి 'వెబ్ ల్యాండ్-2' (ఔవఎ ఘుఅం - 2) నందు నమోదై ఉన్న శ్రీ గొల్ల లక్ష్మీనారాయణ గారి పేరును ఖరారు చేస్తూ, ఆయన హక్కులను నిర్ధారిస్తూ తుది ఉత్తర్వులు జారీ చేశారు.

**అసత్య ప్రచారాలను నమ్మవద్దు:**

***కేసుతో ఎలాంటి సంబంధం లేని వి.వి. నాయుడు మరియు ఇతర అనుచరులతో కలిసి పిటిషనర్ బైరెడ్డి హరిత ఉద్దేశపూర్వకంగానే అసత్య ప్రచారాలు చేస్తున్నారని, విచారణ అంతా పారదర్శకంగా, రికార్డుల ప్రకారమే జరిగిందని రెవెన్యూ విభాగపు అధికారి కార్యాలయం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. వివాదాలకు తావులేకుండా రికార్డుల ఆధారంగానే లక్ష్మీనారాయణ పేరును నిర్ధారించినట్లు అధికారులు వెల్లడించారు.***

# రైతే దేశానికి వెన్నముక వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకే సహకారం

ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ






ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 20, పల్లె వెలుగు రైతుల ఆదాయాన్ని పెంచేదిశగా ప్రభుత్వం పనిచేస్తుందని, అలాగే వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ద్వారా సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. శనివారం ఆళ్లగడ్డ పట్టణంలోని మార్కెట్ యార్డ్ లో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2026-27 సంవత్సరానికి గాను మొదటి విడత 7 వేల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హాజరై ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల 42,981 మంది రైతులకు 29 కోట్ల 10 లక్షల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ఎన్డీఏ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, రైతులకు పెట్టుబడి సాయం, సాగునీరు, మద్దతు ధరలు, వ్యవసాయానికి అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు భూమా విఖ్యాత రెడ్డి మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి గోపాల్, ఎ డి ఎ విజయశేఖర్, ఎంపిడిఓ నూర్జహాన్, ఎమ్మార్వో జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్ బేగం ,మండల వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి, ఆళ్లగడ్డ మండల కన్వీనర్ హరికుమార్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష కృష్ణాపురం టీడీపీ నాయకులు శివారెడ్డి, రఘు రామిరెడ్డి, మర్రి పల్లె పాపిరెడ్డి ,ఇతర మండల వ్యవసాయ అధికారులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


# డాక్టర్ కే రామలింగారెడ్డి మృతి

**-డాక్టర్ రామలింగారెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన**

**- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**



ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 20 పల్లె వెలుగు ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి (87) శనివారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, శనివారం పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆళ్లగడ్డ పట్టణంలో సుదీర్ఘకాలంగా వైద్యుడిగా సేవలందిస్తూ, ప్రజాప్రతినిధిగా పట్టణాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిది. డాక్టర్ కె. రామలింగారెడ్డి మృతి చెందిన విషయం తెలియగానే స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వెంటనే స్పందించారు. పట్టణంలోని నెహ్రూ వీధిలో ఉన్న ఆయన నివాసానికి చేరుకుని, రామలింగారెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ధైర్యంగా ఉండాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ. ఆళ్లగడ్డ పట్టణాభివృద్ధికి, ప్రజలకు వైద్య, విద్య సేవలందించడంలో రామలింగారెడ్డి చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. రామలింగారెడ్డి మరణవార్త తెలియడంతో ఆళ్లగడ్డ పట్టణంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మృతి పట్ల పట్టణంలోని పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, వైద్య బృందం మరియు పట్టణ ప్రజలు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.



# పిఠాపురం భాష్యం పాఠశాలలో ఘనంగా 'యోగోత్సవ్-2026'





పిఠాపురం, జూన్ 20, పల్లె వెలుగు భారతీయ సంస్కృతిలో అంతర్భాగమైన యోగాను విద్యార్థుల దైనందిన జీవితంలో భాగం చేయాలనే లక్ష్యంతో, స్థానిక భాష్యం పబ్లిక్ పాఠశాలలో 'యోగోత్సవ్-2026' కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ యోగోత్సవ్‌లో ఎల్‌కేజీ నుండి 10వ తరగతి వరకు సుమారు 1,000 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, క్లిష్టమైన యోగాసనాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ఈస్ట్-4 జెడ్‌ఈవో పి.వేణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెడ్‌ఈవో మాట్లాడుతూ,యోగ సాధన వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, క్రమశిక్షణ అలవడతాయని, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఇవి ఎంతో అవసరమని పేర్కొన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ అంజిరెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యం. విద్యార్థుల సమగ్ర వికాసానికి యోగా ఒక దివ్యౌషధం వంటిది," అని వివరించారు. అలాగే పాఠశాల హెచ్ఎం అరుణ మాట్లాడుతూ, చిన్న వయస్సు నుంచే యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాదులు పడతాయని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, సిబ్బందిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

# గిరిజన సమస్యల పరిష్కారం కోసం ఐటీడీఏ వద్ద ఆందోళన






పోలవరం, జూన్ 20 పల్లె వెలుగు ఏలూరు జిల్లా పోలవరం మండలం జిల్లెల్లగూడెం పంచాయతీలో గిరిజనుల భూ సమస్యల పరిష్కారం మరియు విద్యారంగ సమస్యలపై ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీలు ఐటీడీఏ వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డిని కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. పోలవరం మండలం జిల్లెల్లగూడెం పంచాయతీలో 30 ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని, గిరిజనేతరుల సెటిల్మెంట్ ఆర్డర్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పాత కుంకాల ఆశ్రమ పాఠశాలలో 3, 4 తరగతులను యథావిధిగా కొనసాగించాలని, రాయుడు చెరువుకు తూము ఏర్పాటు చేయాలని, కొండపోడు భూములకు హక్కులు కల్పించాలని, సాగునీటి సమస్య పరిష్కారానికి రిజర్వాయర్ నిర్మించాలని కోరారు. జీవో నంబర్ 3ని పునరుద్ధరించి, 100 శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీ యువతకే ఇవ్వాలని, రెడ్డి నాగం పాలెం, జిల్లెల్లగూడెం కమ్యూనిటీ హాల్స్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పీవో రాములు నాయక్ కమ్యూనిటీ హాల్స్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిషోర్ ఈ క్రాప్ నమోదుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సవలం రాంబాబు, షేక్ బాషా, మిడియం రవి దొర, చెదల శివకుమార్ రెడ్డి, పట్టేం పరమేశ్వరరావు, కలుం చిన అబ్బులు పాల్గొన్నారు

# కారుమూరి సునీల్ అరెస్టు డైవర్షన్ పాలిటిక్స్ - వుంగరాల సంతోష్




కాకినాడ, జూన్ 20 పల్లె వెలుగు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు మరియు వైసీపీ యువజన నాయకుడు కారుమూరి సునీల్ అరెస్టు అక్రమమని వైసీపీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్ పేర్కొన్నారు. విజయవాడలో గాదె సాయికృష్ణ లాకప్ డెత్ ఘటనపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. శనివారం కాకినాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంతోష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విక్రయాలు పూర్తిగా పారదర్శకంగా జరిగాయని, అటువంటిది ఇప్పుడు లిక్కర్ స్కామ్ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజల సమస్యల పరిష్కారంలో విఫలమైన ప్రభుత్వం, వైసీపీ నాయకులను అణచివేసేందుకు రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకాలు చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం విద్య, వైద్యం, రైతు సమస్యలు మరియు మహిళలపై దాడుల విషయంలో ప్రజలకు సమాధానం చెప్పలేక, ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తోందని సంతోష్ దుయ్యబట్టారు. ఈ అరెస్టులకు భయపడేది లేదని, భవిష్యత్తులో కూటమి ప్రభుత్వ అరాచకాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు

## యానాం, తాళ్లరేవు సరిహద్దు సమస్యల పరిష్కారానికి వినతి

తాళ్లరేవు, జూన్ 20 పల్లె వెలుగు పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం పరిధిలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ మరియు మురుగు నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు విషయంలో యానాం, తాళ్లరేవు సరిహద్దు ప్రాంత ప్రజల మధ్య తలెత్తిన అభిప్రాయ భేదాలను శాంతియుతంగా పరిష్కరించాలని కోరుతూ విశ్వజన కళామండలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి మరియు న్యాయవాది యడ్ల కుటుంబరావు యానాం ప్రాంతీయ పరిపాలన అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యడ్ల కుటుంబరావు మాట్లాడుతూ యానాం మరియు తాళ్లరేవు ప్రాంతాలు భౌగోళికంగా సరిహద్దులు కలిగి ఉండి పరస్పర సహకారంతో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, యానాం మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగాలు పరస్పర సమన్వయంతో చర్చలు జరపాలని ఆయన సూచించారు. ఇరు ప్రాంతాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలని కోరారు. ప్రజల మధ్య విభేదాలు రాకుండా శాంతి సామరస్యాలను కాపాడుతూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు

# రైతు సంక్షేమానికి పెద్దపీట..

## నంద్యాల జిల్లాలో 2.06 లక్షల మంది రైతులకు రూ.139.41 కోట్ల ఆర్థిక సహాయం.

### అన్నదాతకు అండగా ప్రభుత్వం.. ప్రతి అర్హ రైతుకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక భరోసా.

**● వ్యవసాయాభివృద్ధే లక్ష్యం.. రైతుల ఖాతాల్లో భారీగా నిధుల జమ. ● అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్‌తో రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత. ● రైతు సంక్షేమం, భూసార పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు - జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**








**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**
రైతుల ఆర్థిక స్థిరత్వం, వ్యవసాయ రంగాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్" పథకం ద్వారా నంద్యాల జిల్లాలో అర్హులైన రైతులకు భారీ స్థాయిలో ఆర్థిక సహాయం అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం నంద్యాల మండలం పోలూరు గ్రామంలో నిర్వహించిన "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్" పథకం కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 2,06,052 మంది రైతులకు రూ.139.41 కోట్ల ఆర్థిక సహాయం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.103.03 కోట్లు, కేంద్ర ప్రభుత్వం తరపున రూ.36.39 కోట్లు అందించబడినట్లు పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, సాగు ఖర్చులను తగ్గించడం, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక సహాయం మూడు విడతలుగా అందజేస్తున్నట్లు వివరించారు. తొలి, రెండో విడతల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.7 వేల చొప్పున, మూడో విడతలో కేంద్రం నుంచి రూ.2 వేలు, రాష్ట్రం నుంచి రూ.4 వేలు కలిపి రూ.6 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు.

*జిల్లాలో అత్యధికంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని 42,981 మంది రైతులకు రూ.29.10 కోట్లు, బనగానపల్లె నియోజకవర్గంలోని 40,664 మంది రైతులకు రూ.27.41 కోట్లు, నంద్యాల నియోజకవర్గంలోని 36,734 మంది రైతులకు రూ.24.94 కోట్లు అందించగా, డోన్ నియోజకవర్గంలోని 35,011 మంది రైతులకు రూ.23.40 కోట్లు, శ్రీశైలం నియోజకవర్గంలోని 25,018 మంది రైతులకు రూ.17.06 కోట్లు, నందికొట్కూరు నియోజకవర్గంలోని 12,953 మంది రైతులకు రూ.8.79 కోట్లు, పాణ్యం నియోజకవర్గంలోని 12,691 మంది రైతులకు రూ.8.72 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు.*

*వ్యవసాయ ఉత్పాదకత పెరగాలంటే భూసారాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం యూరియా, డి.ఎ.పి., కాంప్లెక్స్ ఎరువులను భారీ సబ్సిడీపై అందిస్తున్నప్పటికీ, వాటిని మితిమీరిన స్థాయిలో వినియోగించడం వల్ల భూమి సారవంతత తగ్గే ప్రమాదం ఉందన్నారు. భూముల్లో జింక్, సూక్ష్మపోషకాలు, కర్బన శాతం లోపిస్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారని, రైతులు పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచడం ద్వారా భూసారాన్ని పరిరక్షించాలని సూచించారు.*

పోలూరు గ్రామంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై స్పందించిన కలెక్టర్, పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే రూ.5 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. పాఠశాల మైదానం లెవెలింగ్ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలోని సీసీ రోడ్లపై నీరు నిలిచే సమస్యను సాంకేతిక నిపుణులతో పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే పొలాల రహదారుల నిర్మాణానికి సంబంధించి ఉపాధి హామీ పథకం సాఫ్ట్‌వేర్‌లో జూలై 1 నుంచి అమల్లోకి రానున్న మార్పుల అనంతరం అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామాభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం, సహకారం ఉంటేనే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు, ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకున్న కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. పోలూరు గ్రామ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, నీటి పారుదల, పాఠశాల మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువస్తే నిధుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

---

## ఘనంగా చింతకుంట వారి వివాహం

### వధూవరుల ఆశీర్వదించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 20 పల్లె వెలుగు టిడిపి సీనియర్ నాయకుడు కాంట్రాక్టర్ నాగిరెడ్డిపల్లె చింతకుంట రామ శేఖర్ రెడ్డి చింతకుంట శివలక్ష్మి దంపతుల కనిష్ట పుత్రిక రామ పూజిత సాయికుమార్ రెడ్డి ల వివాహం ఘనంగా జరిగింది. శనివారం నాడు రుద్రవరం మండలం నరసాపురం మెట్ట జి ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా వివాహం జరిగింది. ఈ వివాహానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు. ఈ వివాహానికి రాజకీయ ప్రముఖులు బంధువులు స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆత్మీయులు తదితరులు తరలివచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహానికి హాజరైన అందరికీ పేరుపేరునా చింతకుంట రామ శేఖర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## ముస్లింల సంక్షేమానికి నిరంతర కృషి చేస్తాం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 20 పల్లె వెలుగు భూమా కుటుంబానికి ముస్లిం మైనారిటీలకు తరతరాలుగా విడదీయరాని ఆత్మీయ బంధం ఉందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు శనివారం ఆళ్లగడ్డ పట్టణంలోని లింగం దిన్నె రోడ్డు ఈద్గాలో నిర్వహించిన ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత భూమా నాగిరెడ్డి భూమా శోభనాగిరెడ్డి ఆశయాల సాధనలో ముస్లింల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు నియోజకవర్గంలో మసీదులు షాది ఖానా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆళ్లగడ్డను మతసామరస్యానికి ప్రతికగా నిలుపుతామన్నారు స్థానిక ముస్లిం సమస్యలకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష, ముస్లిం మత పెద్దలు రాయలసీమ జోన్ కమిటీ సభ్యులు బాబు హుస్సేన్ , టి టి అమీర్ భాష, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## రెండో ఏడాదిలో మొదటి విడత అన్నదాత సుఖీభవ రైతులకు ఊరట

**● రైతుల క్షేమ దేశ భవిష్యత్తు ● రైతు సంతోషమే దేశ అభివృద్ధికి నాంది ● రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప**





ఆదోని :పల్లె వెలుగు): అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించినారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం అర్బన్ నియోజకవర్గ అబ్జర్వర్ మాన్వి దేవేంద్రప్ప హాజరైనరు, చైర్మన్ మాట్లాడుతూ రెండేళ్ల సుపరిపాలన మరియు అన్నదాత సుఖీభవ గురించి ప్రజలకు వివరిస్తూ కుటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క సంక్షేమ పథకాలు సకాల కాలంలో ప్రజలకు మరియు రైతులకు అందిస్తున్నారు మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిలో కూడా దేశంలోనే అధిక పెట్టుబడి తీసుకురావడంలో ఆంధ్ర రాష్ట్రం మొదటి స్థానంలో నిలబెట్టిన ఘనత మన విజనరీ నాయకుడు చంద్రన్నకు దక్కుతుంది, అలాగే యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ యువ ఆలోచనలతో రాష్ట్ర అభివృద్ధిని పురుగులు పట్టిస్తున్నాడు, ఈ క్రమంలో రైతులకు రెండో ఏడాదిలో మొదటి అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం 2000 తొ పాటు రాష్ట్ర ప్రభుత్వం 5000 తో మొత్తం 7000 దాదాపు 46.85 లక్ష రైతులకు =o-3125 కోట్లు ఆర్థిక సహాయం అందిస్తుంది. అలాగే గత వైయస్సార్ ప్రభుత్వం ఐదు సంవత్సరంలో ఒక్క అభివృద్ధి పని చేసినారా? ఒక ఇండస్ట్రీ తెచ్చినారా? రాష్ట్రాన్ని ప్రజలను మభ్యపెట్టి ఆంధ్ర రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడానికి సిద్ధమైనరు, ప్రజలు ఇది తెలుసుకొని 2024 సార్వత్రిక ఎలక్షన్లో అపోజిట్ పార్టీ కూడా లేకుండా 11 సీటుకే పరిమితం చేసినారు, దేశంలో ప్రతిపక్ష పార్టీ లేకుండా రాష్ట్రం ఉందంటే అది ఆంధ్రప్రదేశ్, దీనికి ముఖ్య కారణం ప్రజల ఐదు సంవత్సరాల ఆవేదన అని తెలిపినారు.

## నీట్ (యూజీ)2026 పునఃపరీక్షకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు.

**● ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నీట్ పరీక్ష పూర్తయ్యే వరకు పకడ్బం దీగా విధులు నిర్వర్తించాలి.కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్. ● పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లపై అధికా రులకు దిశానిర్దేశం చేసిన ఎస్పీ.**







పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. నీట్ (యూజీ)2026 పునఃపరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వ హించేందుకు జిల్లాలో పటిష్ట భద్ర తా ఏర్పాట్లు చేసినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారు శనివారం తెలి పారు. ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్ష నేప థ్యంలో జిల్లా పోలీసు కార్యా ల యంలోని పరేడ్ మైదానంలో బందోబ స్తు విధులకు హాజరైన పోలీసు అధికారు లు, సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు.జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో 4,995 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానుండగా, ప్రతి కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల రవాణా సమయంలో కర్నూలుపోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ సిబ్బందితో ఎస్కార్ట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకో వాలన్నారు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా సహకరించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాల న్నారు. అభ్యర్థులను భద్రతా ప్రమా ణాలకు అనుగుణంగా ఫ్రిస్కింగ్ నిర్వ హించి మాత్రమే లోపలికి అనుమతిం చాలని సూచించారు.మొబైల్ ఫోన్లు, ఐప్యాడ్లు, ల్యాప్ టాప్‌లు, బ్లూటూత్ ఇయర్‌ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అను మతించరాదని స్పష్టం చేశారు. పరీక్ష నిర్వహణ మొత్తం కేంద్ర స్థాయిలో పర్యవేక్షణలో ఉంటుందన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్ష పూర్తయ్యే వరకు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్ష సమయం వరకు మూసివేసేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం కర్నూలు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో హెల్ప్ డెస్కులు ఏర్పా టు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్ర మంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, సీఐలు, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com